ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
శుక్రవారం 20 సెప్టెంబరు 2024



## ప్రత్యేక అధికారుల నియామకం

**పార్వతీపురం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి):** జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు ప్రత్యేక అధికారులను నియమించారు. ఈ మేరకు కలెక్టర్ గురువారం ప్రకటన విడుదల చేశారు. పార్వతీపురం నియోజక వర్గానికి జాయింట్ కలెక్టర్ ఎస్.శోభిక, సాలూరుకు పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, పాలకొండకు పాలకొండ సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, కురుపాం నియోజకవర్గానికి జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె.రామచంద్రరావును నియమించారు. వీరు ఆయా నియోజకవర్గాల్లోని కార్యక్రమాలను పర్యవేక్షించనున్నారు.

# సుపరి పాలన



త్వరలో పూర్తికానున్న పూర్ణపాడు, లాబేసు వంతెన

- వంద రోజుల్లో ఎన్నో హామీలు చేసిన కూటమి సర్కారు
- నేటి నుంచి 'ఇది మంచి ప్రభుత్వం' ప్రారంభం
- పది రోజుల పాటు ప్రజల వద్దకు వెళ్లనున్న ఎమ్మెల్యేలు
- చేసిన మంచిని చెప్పనున్న నేతలు

**పార్వతీపురం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా శుక్రవారం నుంచి 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం ప్రారంభంకానుంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు పది రోజుల పాటు జిల్లాకు చెందిన గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ఎమ్మెల్యేలు బోనెల విజయచంద్ర, నిమ్మక జయకృష్ణ, తోయక జగదీశ్వరి తమ నియోజకవర్గాల్లోని ప్రజల వద్దకు వెళ్లి ప్రభుత్వ వంద రోజుల పాలన గురించి వివరించనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వైసీపీ ప్రభుత్వ కాలంలో రాష్ట్ర ఖజానాను ఎలా కొల్లగొట్టారు, ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, అదే విధంగా నియోజకవర్గాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను ప్రజలకు తెలియజేయనున్నారు. గత ప్రభుత్వం రాష్ట్రానికి రాజధాని లేకుండా మూడు రాజధానుల పేరిట ఆడిన నాటకాలు, ప్రస్తుత ప్రభుత్వం అమరావతి నిర్మాణానికి తీసుకుంటున్న చర్యలను చెప్పనున్నారు. సాగునీటి ప్రాజెక్టులపై జగన్ సర్కారు నిర్లక్ష్యాన్ని ప్రజల వద్ద ఎండగట్టనున్నారు. కూటమి ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులపై చూపిస్తున్న ప్రత్యేక శ్రద్ధ తదితర అంశాలను తెలియజేసేందుకు జిల్లా ప్రజాప్రతినిధులు సిద్ధమవుతున్నారు.

### ఎన్నో హామీలు అమలు...

- ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తోంది. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే రూ.3వేలు ఉన్న సామాజిక పింఛన్‌ను రూ.4వేలకు పెంచారు. వైసీపీ ప్రభుత్వం తన ఐదేళ్ల కాలంలో మొదటి సంవత్సరం కాకుండా మిగిలిన నాలుగేళ్లలో ఏడాదికి రూ.250 చొప్పున పెంచుతూ ఎన్నికలకు ముందు పింఛన్‌ను రూ.3వేలు చేసింది. కానీ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఒకేసారి రూ.వెయ్యి పెంచి రూ.4వేలు చేసింది. చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం ఏప్రిల్, మే, జూన్ నెలలను కలుపుకొని మొత్తం రూ.7వేలను లబ్ధిదారులకు అందించడంతో ప్రజలు కూడా ఆశ్చర్యపోయారు.
- గత వైసీపీ ప్రభుత్వం తన ఐదేళ్ల పాలనలో ఒక్క డీఎస్సీ కూడా ప్రకటించలేదు. కానీ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ నిర్వహణకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.
- భూ బకాసురులకు అండగా ఉండేందుకు జగన్ సర్కారు ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను తీసుకొచ్చింది. ఈ చట్టంతో నిజమైన భూ యజమానులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, భూములపై వారికి హక్కులు ఉండవని, ఈ చట్టాన్ని తాము రద్దు చేస్తామని కురుపాంలో జరిగిన ఎన్నికల సభలో చంద్రబాబు ప్రకటించారు. ఇచ్చిన మాట ప్రకారం అధికారం చేపట్టిన వెంటనే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేశారు.
- గత టీడీపీ ప్రభుత్వంలో ఐదు రూపాయలకే పేదలకు కడుపునిండా అన్నం పెట్టే అన్న క్యాంటీన్లను వైసీపీ ప్రభుత్వం మూసివేసింది. అయితే, ఇచ్చిన హామీ మేరకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ క్యాంటీన్లను పునఃప్రారంభిస్తోంది. ఇప్పటికే జిల్లా కేంద్రం పార్వతీపురంలో అన్న క్యాంటీన్ సిద్ధమయ్యింది. మిగిలిన మూడు నియోజకవర్గాల్లో కూడా త్వరలోనే ప్రారంభించనున్నారు.
- ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుకునే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందించకుండా జగన్ ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేసింది. దీనివల్ల ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ విద్యార్థులు వెనుకబడిపోయిన పరిస్థితి ఏర్పడింది. అయితే, కూటమి ప్రభుత్వ అధికారంలోకి రాగానే ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలను అందించింది. విద్యాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుంది.
- జగన్ పాలనలో ఇసుక ధరలు సామాన్యులకు చుక్కలు చూపించేవి. ట్రాక్టర్ ఇసుక రూ.4వేలు పలికేది. దీంతో ఇసుక కొనుగోలు చేయలేక నిర్మాణరంగం కుదేలైంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఇసుకను ఉచితంగా అందజేస్తుంది. ఇసుక బుకింగ్ కోసం ఆన్‌లైన్ పోర్టల్‌ను కూడా ప్రారంభించింది.
- తెల్ల కార్డు ఉన్న కుటుంబాలకు ఏటా ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు ఇస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు వాగ్దానం చేశారు. ఇచ్చిన మాట ప్రకారం ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని దీపావళి నుంచి ప్రారంభించాలని కేబినెట్ నిర్ణయించింది. అలాగే, తల్లికి వందనం, బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రైతులకు పెట్టుబడి సాయం పథకాలను అమలు చేసేందుకు రంగం సిద్ధం అవుతుంది.



సాలూరు మండలం కారాడవలస గ్రామంలో కంటైనర్ ఆస్పత్రిని ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ (ఫైల్)

### జిల్లాకు ఇచ్చిన హామీలు అమలు...

జిల్లాకు సంబంధించి ఎన్నికల్లో ఆయా నియోజకవర్గాల కూటమి అభ్యర్థులు ఇచ్చిన హామీలను కూడా అమలు చేస్తున్నారు. సాలూరు నియోజకవర్గంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి రూ.3కోట్లు మంజూరు చేయించారు. గిరిజన ప్రాంతాల్లో డోలీల మోత ఉండకూడదన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కంటైనర్ ఆసుపత్రుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. మొదటి విడతగా సాలూరు మండలం తోనాం పీహెచ్‌సీ పరిధిలోని కారాడవలస గ్రామంలో కంటైనర్ ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. తన నియోజకవర్గ పరిధిలోని సీతంపేటలో పసుపు, జీడి ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామని ఎన్నికల్లో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ హామీనిచ్చారు. ఈ మేరకు సీతంపేటలో పసుపు ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబు ఈ విషయాన్ని ప్రకటించారు. కురుపాం నియోజకవర్గంలో పూర్ణపాడు, లాబేసు వంతెన పూర్తి చేయిస్తానని ఎమ్మెల్యే జగదీశ్వరి ఎన్నికల ప్రచారంలో హామీనిచ్చారు. ఈ కలను త్వరలో సాకారం చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. పార్వతీపురం నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి పెద్దపీట వేస్తానని, నిధులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే విజయ్‌చంద్ర ప్రజలకు మాట ఇచ్చారు. ఆయన చెప్పినట్లు రహదారుల నిర్మాణాల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా నాబార్డు నిధులు మంజూరు చేయించింది.

## రోడ్ల మరమ్మతులకు రూ.11.75 కోట్లు మంజూరు

**పార్వతీపురం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి):** జిల్లాలో రోడ్డు మరమ్మతులకు ప్రభుత్వం రూ.11.75 కోట్లు మంజూరు చేసిందని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఈ నెల 18న జీవో 53 జారీ చేసిందన్నారు. రాష్ట్రంలోని స్టేట్ హైవేలు, జిల్లాల ప్రధాన రహదారుల అత్యవసర మరమ్మతులు, ప్యాచ్ వర్క్‌ల కోసం రూ.290.40 కోట్లకు ప్రభుత్వం పరిపాలనా అనుమతి ఇచ్చిందన్నారు. ఈ ఏడాది జూలైలో భారీ వర్షాలు, వరదల కారణంగా తీవ్రంగా దెబ్బతిన్న రహదారులను ఇందులో చేర్చినట్లు చెప్పారు. పార్వతీపురం జిల్లాకు సంబంధించి ప్రధాన జిల్లా రోడ్లు (ఎండీఆర్), స్టేట్‌హైవే (ఎస్‌హెచ్) రోడ్లు అత్యవసర మరమ్మతులు, ప్యాచ్ పనులకు రూ.11.75 కోట్లతో అంచనాలు సమర్పించినట్లు తెలిపారు. ప్యాచ్ వర్క్స్ కింద రూ.2 కోట్లతో 72.76 కిలోమీటర్లు, అత్యవసర మరమ్మతుల కింద రూ.9.75 కోట్లతో 128.66 కిలోమీటర్ల మేర రహదారులు బాగు చేయనున్నట్లు వివరించారు.

## ఎవరికి దక్కుతాయో?


- ఊరిస్తున్న నామినేటెడ్ పోస్టులు
- ఆశావహుల ఎదురుచూపు
- మూడు నెలలవుతున్నా భర్తీకాని వైనం

(పార్వతీపురం ఆంధ్రజ్యోతి)

నామినేటెడ్ పోస్టుల్లో అందరికీ అవకాశం కల్పిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించడంతో ఆశావహుల్లో సందడి నెలకొంది. ఈ పోస్టులు కూటమి నాయకులను ఊరిస్తున్నాయి. ముఖ్యంగా జిల్లాలోని టీడీపీ ద్వితీయ శ్రేణి ముఖ్యనాయకులు వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు. ఎవరికి దక్కుతాయోనని ఆశగా ఎదురుచూస్తున్నారు. అయితే, కూటమి ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు దాటుతున్నా నామినేటెడ్ పదవులు భర్తీ కావడం లేదు. వైసీపీ ఐదేళ్ల పాలనలో జిల్లాలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎన్నో అవమానాలు, ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నారు. అయినా బెదిరిపోకుండా ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా పని చేశారు. ఇలాంటి వారంతా నామినేటెడ్ పోస్టులపై ఆశలు పెట్టుకున్నారు. పదవులు వస్తాయి, తమ కష్టానికి ఫలితం దక్కుతుందని భావిస్తున్నారు.

### జిల్లాలో ఎన్నో పదవులు..

జిల్లా స్థాయిలో ఎన్నో నామినేటెడ్ పదవులు ఉన్నాయి. కురుపాం, పార్వతీపురం, సాలూరు, పాలకొండ మార్కెట్ కమిటీల చైర్మన్ పదవులతో పాటు వైస్ చైర్మన్ పదవులు ఉన్నాయి. అదే విధంగా నాలుగు మార్కెట్ యార్డు కమిటీలకు సంబంధించి డైరెక్టర్ పదవులు భర్తీ చేయవచ్చు. అలాగే, తోటపల్లి దేవస్థానంతో పాటు పార్వతీపురం, సాలూరు తదితర ప్రాంతాల్లోని ముఖ్య దేవాలయాల్లో నామినేటెడ్ పదవుల కోసం ఎంతో మంది ఎదురుచూస్తున్నారు. కొప్పుల వెలమ, కాపు, శిష్టకరణం తదితర సామాజిక వర్గాల కార్పొరేషన్లకు సంబంధించి చైర్మన్ల పదవులు కూడా భర్తీ చేయాల్సి ఉంది. అయితే, పార్టీని నమ్ముకున్న వారికే ఈ పదవులు ఇవ్వాలని పలువురు టీడీపీ నాయకులు కోరుతున్నారు. గత ఎన్నికల్లో కొన్ని నియోజకవర్గాల్లో వైసీపీతో కొందరు నేతలు కుమ్మక్కై కూటమి అభ్యర్థులను ఓడించేందుకు ప్రయత్నించారని, అటువంటి వారిని పక్కన పెట్టాలని అంటున్నారు.



## జిల్లాలో ఉచిత ఇసుక సరఫరా ప్రారంభం

**పార్వతీపురం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి):** జిల్లాలో ఉచిత ఇసుక సరఫరా ప్రారంభమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం ఇసుక బుకింగ్ కోసం పోర్టల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. భామిని మండలం కాట్రగడలో ఉచిత ఇసుక సరఫరా ప్రారంభమైందని, దీన్ని పొందడానికి వినియోగదారులు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలని తెలిపారు. వినియోగదారులు స్వయంగా లేదా గ్రామ సచివాలయం వద్ద నమోదు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ ఇసుక అవసరం ఉన్నవారు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చునని చెప్పారు. కేవలం తవ్వకాలు, నిర్వహణ, రవాణా చార్జీలు మాత్రమే భరించాలన్నారు. నమోదు చేసుకున్న వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జేసీ శోభిక, జిల్లా రెవెన్యూ అధికారి కేశవనాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## తెరచాటుకు కోటదుర్గమ్మ

**పాలకొండ, సెప్టెంబరు 19:** ఉత్కళాంధ్ర ఆరాధ్య దైవం కోటదుర్గమ్మ అమ్మవారు గురువారం తెరచాటుకు వెళ్లారు. గురువారం నుంచి అక్టోబరు 3 వరకు ఉత్సవ విగ్రహాన్నే భక్తులు దర్శించుకోనున్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి నిజరూప విగ్రహానికి ఇప్పటివరకు ఉన్న చందనం, పసుపు, కుంకుమ, ఇతర సుగంధ ద్రవ్యాలను తొలగించారు. అనంతరం నూతన చందనం, పసుపు, కుంకుమను అమ్మవారి విగ్రహానికి పూతపూశారు. అక్టోబరు 3న అమ్మవారు నిజరూపంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీ ప్రసాదశర్మ, ఆలయ ఈవో మురళీకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారు తెరచాటుకు వెళ్లారు. అక్టోబరు 3 నుంచి 12 వరకు దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు దేవదాయశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది.



తెరచాటుకు అమ్మవారు వెళ్లడంతో భక్తులకు దర్శనం ఇస్తున్న ఉత్సవ విగ్రహం

## 18 అడుగుల గిరినాగు హతం

తుండ పంచాయతీ చినఊటగెడ్డలో గురువారం 18 అడుగుల గిరినాగు (కింగ్ కోబ్రా)ను గ్రామస్థులు హతమార్చారు. గ్రామానికి ఆనుకొని ఓ డిపో వెనుక ఉన్న జీడితోటలో పాములు బుసలు కొడుతుండడాన్ని అటుగా వెళ్తున్న స్థానిక మహిళలు చూశారు. ఈ విషయాన్ని గ్రామస్థులకు చెప్పడంతో వారు వచ్చి చూడగా.. గిరినాగు.. జెర్రిపోతును మింగుతూ కన్పించింది. గిరినాగు విషపూరితం కావడం, ఈ ప్రాంతం అందరూ నడిచే మార్గం కావడంతో దానివల్ల హాని కలుగుతుందని భావించి కర్రలతో కొట్టి హతమార్చారు.

-సాలూరు రూరల్



హతమైన గిరినాగు, పక్కనే జెర్రిపోతు

## సిరిమానోత్సవానికి నేడు అంకురార్పణ

- చదురు, వనంగుడిలో పందిరిరాట
- మండల దీక్షలూ ప్రారంభం






పైడిమాంబకు గవరవీధి వాసుల సారె (ఫైల్)

**విజయనగరం రూరల్:** నడిచే దేవతగా పేరొందిన.. పైడిమాంబ సిరిమానోత్సవానికి శుక్రవారం అంకుర్పారణ జరగనుంది. మూడులాంతర్ల వద్దనున్న చదురుగుడి, రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న వనంగుడి వద్ద సంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా పందిరిరాట తంతు నిర్వహించనున్నారు. ఇందుకోసం దేవస్థానం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. చదురుగుడి వద్ద ఉదయం 9.32 గంటలకు, వనంగుడి వద్ద 11.01 గంటలకు ఈ పందిరిరాట ప్రక్రియ నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటలకు చదురుగుడి వద్ద పైడిమాంబ మాలధారణ చేసే భక్తులు మండల దీక్ష చేపడ్తారు. పందిరిరాట పూర్తయ్యాక సిరిమానోత్సవానికి సంబంధించిన మిగతా ప్రక్రియలను వేగవంతం చేయనున్నారు. సంప్రదాయబద్ధంగా పండగ చాటింపును మంగళవారం నిర్వహించనున్నారు. అదే రోజు నుంచి నగర ప్రజలు, పైడిమాంబ భక్తులు మొక్కుబడులు తీర్చుకుంటుంటారు. ముఖ్యంగా ముర్రాటలు (ఘటాలు) పైడిమాంబకి సమర్పించే కార్యక్రమం కూడా మంగళవారం నుంచే ప్రారంభం కానుంది. వ్యక్తిగతంగా చాలా మంది ముర్రాటలు సమర్పించినా, సామూహికంగా తమ, తమ ప్రాంతాల నుంచి ముర్రాటలు ఆ రోజు మాత్రమే సమర్పిస్తారు. ఇప్పిలివీధి, జొన్నగుడ్డి, లంకాపట్టణం, భంగివీధి, హుంకుంపేట, కొత్తపేట, సంతపేట, యాదవవీధి, బూర్లెపేట, గవరవీధి, లంకవీధి, కోరాడవీధి, రంగిరాజువీధి తదితర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు ముర్రాటలు సమర్పించనున్నారు. గవరవీధి వాసులు మూడు రోజుల కార్యక్రమాన్ని నిర్వహించి, పైడిమాంబకు సారె నివేదిస్తారు.

## కందిపప్పు ఇవ్వట్లే!

- రెండు నెలలుగా అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేయని వైనం
- లబ్ధిదారులకు తప్పని ఇబ్బందులు



**సీతంపేట రూరల్, సెప్టెంబరు 19:** అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, మూడేళ్లలోపు చిన్నారులకు అందించే పౌష్టికాహారంలో కందిపప్పు ప్రధానమైనది. అయితే, సీతంపేట ఐటీడీఏ పరిధిలోని సీతంపేట, భామిని మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు రెండు నెలలుగా కంది పప్పు సరఫరా కావడం లేదు. దీంతో లబ్ధిదారుల్లో పౌష్టికాహార సమస్యలు తలెత్తుతున్నాయి. సీతంపేట మండలంలో 122 మెయిన్, 109 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 5 వేల మంది లబ్ధిదారు లు పౌష్టికాహారం పొందుతున్నారు. భామిని మండలంలోని 78 అంగన్‌వాడీ కేంద్రాల్లో సుమారు 2వేల మంది లబ్ధిదారులు ఉన్నారు. ఈ రెండు మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రతీ నెల 5 క్వింటాల కందిపప్పు అవసరం ఉంటుంది. సీతంపేట మండలానికి 3 క్వింటాలు, భామిని మండలానికి 2 క్వింటాలు సరఫరా చేయాల్సి ఉంది. కానీ దీనికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ ఆలస్యం అవ్వడంతో గత రెండు నెలలుగా అంగన్‌వాడీ కేంద్రాలకు కందిపప్పు సరఫరా నిలిచిపోయింది. దీంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు.


### టెండర్లు పూర్తయ్యాయి..

అంగన్‌వాడీ కేంద్రాలకు నిత్యావసరాలు సరఫరా చేసేందుకు వారం రోజుల కిందట టెండర్ల ప్రక్రియ పూర్తయింది. కొద్ది రోజుల్లో కందిపప్పు సరఫరా జరుగుతుంది. కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో కందిపప్పు అందుబాటులో ఉంది. లేని కేంద్రాల్లో నిర్వాహకులు కందిపప్పు కొనుగోలు చేసి లబ్ధిదారులకు అందజేయాలి.

-రంగలక్ష్మి, సీడీపీవో, ఐసీడీఎస్

# నిజాన్ని అంగీకరించండి లేదా పోరాడండి

కొరియోగ్రాఫర్ షేక్ జానీభాషా (జానీ మాస్టర్) లైంగిక ఆరోపణలు ఎదుర్కోవడంతో ఆయనపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ విషయంపై నటుడు మంచుమనోజ్ స్పందించి.. ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. 'తప్పు చేస్తే అంగీకరించండి లేదా పోరాటం చేయండి. అంతేకాని పారిపోవద్దు' అని ఆయన హితవు పలికారు. "జానీ మాస్టర్.. కెరీర్ పరంగా ఈ స్థాయికి వచ్చేందుకు మీరు ఎంతలా శ్రమించారో అందరికీ తెలుసు. ఈరోజు మీపై ఇలాంటి ఆరోపణలు రావడం చూస్తుంటే నా హృదయం ముక్కలవుతోంది. నిజం ఎప్పటికైనా బయటపడుతుంది. తప్పు ఎవరిది అనేది చట్టం నిర్ణయిస్తుంది. ఒక మహిళ తన స్వరాన్ని వినిపించినప్పుడు


పారిపోవడం అనేది సమాజానికి, రానున్న తరాలకు ఒక ప్రమాదకరమైన సందేశాన్ని ఇస్తుంది. జానీ మాస్టర్.. నిజాన్ని ఎదుర్కోండి. మీరు ఏ తప్పూ చేయకపోతే పోరాటం చేయండి. మీరు దోషి అయితే.. దానిని అంగీకరించండి ఈ కేసు విషయంలో వేగంగా స్పందించి చర్యలు తీసుకున్న హైదరాబాద్ సిటీ పోలీస్‌లకు అభినందనలు. చట్టానికి ఎవరూ అతీతులు కాదని ఇది తెలియజేస్తుంది. మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఇచ్చిన మాట ప్రకారం ఉమెన్స్ ప్రొటెక్షన్ సెల్‌ని వెంటనే సిద్ధం చేయాలని కోరుతున్నా. దానికంటూ ప్రత్యేకంగా సోషల్‌మీడియా ఖాతాలు ఏర్పాటు చేయండి. మన పరిశ్రమలోని మహిళలకు గళంగా నిలవండి. ఇబ్బందుల్లో ఉన్న మహిళల బాధను వింటామనే విషయాన్ని ప్రతి మహిళకు తెలియజేయండి. ఈ క్లిష్ట పరిస్థితుల్లో అండగా నిలబడిన మన పరిశ్రమ పెద్దలు, కో వర్కర్స్‌కు నా మద్దతు తెలియజేస్తున్నా. న్యాయం, గౌరవం అనేది మాటల్లో మాత్రమే కాకుండా చేతల్లోనూ చూపించే విధమైన సమాజాన్ని నిర్మిద్దాం. కూతురు, సోదరి, తల్లి.. ఇలా ప్రతి మహిళ కోసం ఈ పోరాటం. వారికి అన్యాయం జరగకుండా చూద్దాం" అని మనోజ్ పేర్కొన్నారు. అలాగే, మరో నటుడు నాగబాబు చేసిన ఓ ట్వీట్ ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఆయన చేసిన ట్వీట్ జానీ భాషాని ఉద్దేశించినదే అని నెటిజనులు అనుకుంటున్నారు. ఇంతకీ ఆ ట్వీట్‌లో ఏముందంటే.. "తప్పు చేసిన వ్యక్తి చట్టపరంగా దోషిగా తేలనంతవరకూ.. ఆ వ్యక్తి తప్పు చేసినట్లు కాదు" అని సర్ విలియమ్ గ్యారో అనే రచయిత కొటేషన్‌ను నాగబాబు పోస్ట్ చేశారు.

## కొత్త తేదీన కంగువ




సూర్య కథానాయకుడిగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'కంగువ'. ఈ సినిమా కొత్త రిలీజ్ డేట్ ఖరారైంది. నవంబర్ 14న 'కంగువ'ను విడుదల చేస్తున్నారు. ఈ విషయాన్ని తెలుపుతూ యూనిట్ గురువారం ప్రత్యేక వీడియోను విడుదల చేసింది. శివ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో దిశాపటానీ, బాబీడియోల్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు.

## గుండెను తాకే నాన్న పాట



సుధీర్‌బాబు కథానాయకుడిగా రూపొందుతున్న కుటుంబ కథా చిత్రం 'మా నాన్న సూపర్ హీరో'. అభిలాష్‌రెడ్డి కంకర దర్శకత్వంలో సునీల్ బలుసు నిర్మిస్తున్నారు. చిత్రబృందం గురువారం 'నాన్న' సాంగ్‌ను విడుదల చేసింది. తండ్రీ కొడుకుల మధ్య అనుబంధాన్ని ఆవిష్కరిస్తూ సాగే ఈ గీతానికి లక్ష్మీ ప్రియాంక సాహిత్యం అందించగా జై కృష్ణ స్వరపరిచారు. నజీరుద్దీన్ ఆలపించారు. ఆర్ణ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో సాయిచంద్, ఆమని కీలకపాత్రలు పోషిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: సమీర్ కల్యాణి



**అనంత శూన్యం నుంచి ప్రారంభమై అన్నింటినీ తనలో ఇమడ్చుకున్న మహామనీషి అక్కినేని. తెలుగు అక్షరమాలలో మొదటి అక్షరంతో మొదలైన ఆయన పేరు మిగిలిన అక్షరాలకు ధైర్యాన్ని ఇవ్వడమే కాదు, ఆయన జీవితాన్ని ఒక అందమైన కావ్యంగా తీర్చిదిద్దింది. మహానటుడిగా నిలబెట్టింది. దైవం, అదృష్టాల కన్నా కృషినే నమ్మారు అక్కినేని. ఆయన శతజయంతి (సెప్టెంబర్ 20) సందర్భంగా పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఒక ప్రత్యేక స్టాంప్ విడుదల చేస్తోంది.**

జననం - 20-09-1924
మరణం - 22-01-2014

# ఓ బాటసారి నిను మరువమోయి



భారతీయ చిత్ర పరిశ్రమలో ఒక శిఖరంలాంటి నటుడు అక్కినేని నాగేశ్వరరావు. 90 వసంతాల జీవితంలో 70 వసంతాలను అభినయ కళకు అర్పించిన అరుదైన నటుడు. రంగస్థలంపై ఆడవేషాలతో నటనను ఆరంభించి కాలక్రమంలో అభినయ కళాశాలగా, నట నిఘంటువుగా ఎదిగారాయన.

ప్రారంభంలో జానపద, పౌరాణిక చిత్రాల కథనాయకునిగా తన నటజీవితాన్ని ఆరంభించినప్పటికీ కాలక్రమంలో అనేకానేక ఆధ్యాత్మిక, సాంఘిక పాత్రల ద్వారా సమకాలీన జీవన సొబగులను అభినయించి సినీ మాధ్యమాన్ని జనజీవనంతో మమైకం చేసిన ప్రజానటుడు ఆయన.

వాల్మీకి, క్షేత్రయ్య, తుకారామ్, తెనాలి రామకృష్ణ, విప్రనారాయణ, జయదేవుడు, కబీరు, కాళిదాసు వంటి విభిన్న పాత్రలు పోషించి తనకు తానే సాటి అనిపించుకున్నారు. నటనకే పరిమితం అవకుండా నిర్మాణరంగంలోకి ప్రవేశించారు. నాటకాల రోజుల నుంచి తనకు ఎంతో అండగా నిలిచిన దుక్కిపాటి మధుసూదనరావుతో కలసి అన్నపూర్ణ పిక్చర్స్ పతాకంపై ఆణిముత్యాల లాంటి చిత్రాలు నిర్మించారు. దర్శకుడు ఆదుర్తి సుబ్బారావుతో కలసి చక్రవర్తి చిత్ర పతాకంపై 'సుడిగుండాలు', 'మరో ప్రపంచం' వంటి ప్రయోగాత్మక సినిమాలు తీశారు. ఆ తర్వాత అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై ఎన్నో చిత్రాలు అందించారు.

### స్వరాష్ట్రంలో చిత్ర పరిశ్రమ

తెలుగు చిత్ర పరిశ్రమ మదరాసు నగరం నుంచి హైదరాబాద్‌కు తరలి రావడానికి తొలి రోజుల్లో ఎంతో కృషి చేసిన వ్యక్తి అక్కినేని. 'నాతో సినిమా తీయాలనుకునే




నిర్మాతలు హైదరాబాద్‌కు రండి' అని కండీషన్ పెట్టి, దాని మీదే చివరి వరకూ నిలబడ్డారు అక్కినేని. ఆ రోజుల్లో భాగ్యనగరంలో చిత్ర నిర్మాణానికి అవసరమైన వసతులు అరకొరకుగానే ఉన్నా, వాటితోనే సరిపుచ్చుకుని అద్భుత చిత్రాలు తీయడానికి కారకులయ్యారు అక్కినేని.

### మూడు పద్మాలూ ఆయనకే!

ఒక నటునిగా, నిర్మాతగా, స్టూడియో అధినేతగా, ఓ మహోన్నత వ్యక్తిగా అక్కినేని నాగేశ్వరరావు అందించిన విశిష్ట సేవలను గుర్తించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ తమ అధికార పరిధిలోని సమస్త సినీ ఘన పురస్కారాలను ఆయనకు కట్టబెట్టి పట్టాభిషేకాలు చేశాయి. మూడు పద్మాలు.. పద్మశ్రీ పద్మభూషణ్, పద్మవిభూషణ్ పొందిన ఏకైక నటుడు అక్కినేని. అలాగే ప్రతిష్ఠాత్మక దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుతో తెలుగు వెలుగుల్ని హస్తినాపురం వరకూ ప్రసరింపచేసిన తొలి దక్షిణాది కథానాయకుడు అక్కినేని నాగేశ్వరరావు.

### నటనకే అంకితమైన కుటుంబం

ఏయన్నార్‌తో పాటు ఆయన కుటుంబం కూడా చిత్రపరిశ్రమకే అంకితమైంది. నాగేశ్వరరావు పెద్ద కుమారుడు వెంకట్ నిర్మాతగా కొనసాగారు. రెండో కుమారుడు నాగార్జున నటుడిగా, ఆయన కుమారుడు నాగచైతన్య, అఖిల్ హీరోలుగా ఉన్నారు. అక్కినేని పెద్ద అల్లుడు సురేంద్ర నిర్మాత కాగా, ఆయన కుమారుడు సుమంత్ నటుడిగా, కుమార్తె సుప్రియ కూడా ఆర్టిస్టులుగా కొనసాగుతున్నారు. అన్నపూర్ణ స్టూడియో బాధ్యతల్ని సుప్రియ నిర్వర్తిస్తున్నారు. ఇక అక్కినేని చిన్న కుమార్తె సుశీల కూడా నిర్మాతగా ఉన్నారు. ఆమె కుమారుడు సుశాంత్ నటుడిగా కొనసాగుతున్నారు.




ఒకే కుటుంబానికి చెందిన మూడు తరాల కథానాయకులు పృథ్వీరాజ్ కపూర్, రాజ్ కపూర్, రణధీర్ కపూర్ కలసి హిందీలో 'కల్ ఆజ్ ఔర్ కల్' (నిన్న నేడు రేపు) అనే చిత్రంలో కలిసి నటించారు. అది 1971లో విడుదలైంది. దాని తర్వాత మూడు తరాల కథానాయకులు కలిసి నటించిన చిత్రం 'మనం'. నాగేశ్వరరావు, నాగార్జున, నాగచైతన్య అందులో ప్రధాన పాత్రధారులు. అఖిల్ ఈ సినిమా పతాక సన్నివేశంలో కనిపిస్తారు. మూడు తరాలకు సంబంధించి ఆసక్తికరమైన కథను తయారు చేసి, విక్రమ్ కుమార్ దర్శకత్వం వహించారు.

### తొలి సినిమా 'శ్రీసీతారామ జననం'

మొదటి చిత్రం 'శ్రీసీతారామ జననం'లో శ్రీరాముడి పాత్రను అక్కినేని పోషించారు. 1944లో విడుదలైన ఈ చిత్రానికి ఘంటసాల బలరామయ్య నిర్మాత, దర్శకుడు.



సాధారణంగా ప్రేక్షకులెప్పుడూ హీరో పాత్ర మరణించడాన్ని జీర్ణించుకోలేరు. కానీ, అక్కినేని నటించిన దేవదాసు, ప్రేమాభిషేకం సినిమాల్లో హీరో మరణించినా ప్రేక్షకులు వాటికి బ్రహ్మరథం పట్టారు. ప్రణయ భావాల్ని, విషాదాల్నీ పలికించడం ఎవరికైనా సులువే. కానీ, వైరాగ్యాన్నీ, వేదాంతాన్నీ కలగలిపి పలికించడం అంత సులువేం కాదు. కళ్లు ఏడుస్తుంటే, పెదాలు నవ్వడం ఏకకాలంలో జరగాలి మరి! అలాంటి కష్టసాధ్యమైన హావభావాల్ని అలవోకగా, అద్భుతంగా పండించిన అసామాన్యుడు అక్కినేని. అందుకే భగ్న ప్రేమికుడి పాత్రలకు ఆలంబనగా, తాగుబోతు పాత్రలకు చిరునామాగా నిలిచారు అక్కినేని

'స్వీయ లోపంబు లెరుగుట పెద్ద విద్య'.. ..అక్కినేని తరుచుగా చెప్పే మాట ఇది. చెప్పడమే కాదు ఆచరణలో కూడా చూపించారు. తన లోపాలను ఇతరులకంటే ముందు గ్రహించి, దానికి అనుగుణంగానే పాత్రలు ఎంపిక చేసుకోవడం అక్కినేని విజయరహస్యం. మనిషి అందగాడు కాదు, అరడుగుల ఆజానబాహు కాదు. మరో వైపు ఎన్టీఆర్ వంటి సర్వాంగ సుందరుడు, ఆజానుబాహుడు తన పోటీగా, సమవుజ్జీగా ఎదుగుతుండగా తన అనర్హతల లేమిని కప్పిపుచ్చుకుంటూ, తన మనోబలాన్ని పెంచుకుంటూ అక్కినేని సాగించిన ఆరోగ్యకరమైన వృత్తిపోటీ ఈ నాటి యువతకు ఆదర్శంగా నిలుస్తుందని చెప్పాలి

అక్కినేని పోషించిన దసరా బుల్లోడు పాత్ర ఒక సంచలనం. అతను టిప్‌టాప్‌గా రంగురంగుల బట్టలు వేస్తాడు. హీరోయిన్‌తో షికార్లు చేస్తాడు. 'పచ్చగడ్డి కోసేటి పడుచు పిల్లోయ్.. నీ పైటకొంగు జారిందే గడుసు పిల్లా' అని ఆమెని టీజ్ చేస్తాడు. డాన్సులు వేస్తాడు. తమ కుటుంబానికి అపకారం తలపెట్టిన దుష్టుల తాట వలిచేస్తాడు. ఆ పాత్రను సృష్టించింది వి.బి. రాజేంద్రప్రసాద్. ఆ సినిమాకి ఆయనే నిర్మాత, అంతేకాదు, ఆ సినిమాతోటే ఆయన దర్శకుడి అవతారమెత్తారు. అలా 'దసరా బుల్లోడు'గా అక్కినేని వీరంగం ఆడేశారు. ఆయన స్టెప్పుల్లో జనం స్టెప్పులేశారు. ఆ సినిమా నుంచే 'డాన్సింగ్ ఐకాన్'గా రూపు దాల్చారు.

## చిత్రీకరణ షురూ



'దసరా' కలయిక మరోసారి కుదిరింది. నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కలయికలో మరో చిత్రం రూపుదిద్దుకోనుంది. ఇటీవలే చిత్రీకరణ ప్రారంభించారు. ఈ విషయాన్ని శ్రీకాంత్ ఓదెల సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. ఎస్ఎల్‌వీ సినిమాస్ బేనర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో ప్రకటించనున్నారు.

అప్‌డేట్స్

## సంపత్ నందితో శర్వా



శర్వానంద్ కథానాయకుడిగా కొత్త చిత్రం ఖరారైంది. 'శర్వా 38' వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి సంపత్ నంది దర్శకత్వం వహిస్తున్నారు. లక్ష్మీ రాధామోహన్ సమర్పణలో కెకె రాధామోహన్ నిర్మిస్తున్నారు. ఈ విషయాన్ని తెలుపుతూ గురువారం మేకర్స్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను విడుదల చేశారు. శర్వా మునుపెన్నడూ చేయని పాత్రలో కనిపించనున్నారని యూనిట్ తెలిపింది. సంగీతం: భీమ్స్ సిసిరోలియో, సినిమాటోగ్రఫీ: సౌందర్ రాజన్ ఎస్

## మరోసారి మెగాఫోన్



ధనుష్ తాను కీలకపాత్రలో నటిస్తూ, దర్శకత్వం వహించిన 'రాయన్' చిత్రం ప్రేక్షకులను అలరించింది. ఇప్పుడు మరోసారి ఆయన ఓ చిత్రంలో హీరోగా నటించడంతో పాటు మెగాఫోన్ పట్టారు. డాన్‌పిక్చర్స్, వండర్‌బార్ ఫిల్మ్స్ బేనర్‌పై ఆకాశ్ భాస్కరన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి 'ఇడ్లీ కడై' అనే ఆసక్తికర టైటిల్‌ను మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఇడ్లీ బండి దగ్గర పిల్లలు నిల్చున్న పోస్టర్‌ను విడుదల చేశారు. ధనుష్‌కు దర్శకుడిగా ఇది నాలుగో చిత్రం. జీవీ ప్రకాశ్ కుమార్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: కిరణ్ కౌశిక్.

## వారంలోగా తేల్చండి



కంగనా రనౌత్, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ పాత్రలో నటించి.. స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'ఎమర్జెన్సీ'. సెన్సార్ చిక్కులతో చిత్రం విడుదల వాయిదా పడుతోంది. అయితే ఈ సినిమా సెన్సార్ సర్టిఫికెట్ విషయంలో వారంలోగా ఓ నిర్ణయానికి రావాలని బాంబే హైకోర్టు సెన్సార్ బోర్డును ఆదేశించింది. ఈ సినిమా సెప్టెంబర్ 6న విడుదల కావాల్సి ఉంది. అయితే ఈ చిత్రంలో సిక్కు వర్గాన్ని కించపరిచే సన్నివేశాలు ఉన్నాయి కాబట్టి సినిమా విడుదలను నిలిపివేయాలని కొన్ని సంస్థలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. దీనిపై విచారణ జరిపిన కోర్టు వారి వాదనలను పరిగణలోకి తీసుకోవాలని సెన్సార్ బోర్డుకు సూచించింది. మరోవైపు కంగన, చిత్ర నిర్మాణసంస్థ జీ ఎంటర్టైన్‌మెంట్స్ ఈ విషయమై బాంబే కోర్టును ఆశ్రయించగా, సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వమని.. సెన్సార్ బోర్డును ఆదేశించలేమని బాంబే హైకోర్టు తెలిపింది. ఈ క్రమంలోనే తాజా విచారణ అనంతరం వారంలోపు ఓ నిర్ణయానికి రావాలని బాంబే కోర్టు సెన్సార్ బోర్డుకు సూచించింది.

# నేటి నుంచి 'ఇది మంచి ప్రభుత్వం'

- ఇంటింటా ప్రభుత్వ కార్యక్రమాల ప్రచారం
- స్వర్ణాంధ్ర 2047 పై ప్రజాభిప్రాయ సేకరణ ● కలెక్టర్ అంబేడ్కర్


మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

**కలెక్టరేట్:** 'ఇది మంచి ప్రభుత్వం' పేరుతో వంద రోజుల ప్రభుత్వ పాలనపై విస్తృత ప్రచార కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నుంచి నిర్వహించాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ లో జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులతో ఆన్‌లైన్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటైన ఈ వంద రోజుల్లోనే ఎన్నో పథకాలు, కార్యక్రమాలను అమలు చేసిందని, వీటిపై ప్రచారం చేయాలన్నారు. ఈ నెల 20 నుంచి 26 తేదీ వరకూ నిర్వహించాలన్నారు. ప్రతి గ్రామంలోనూ ఈ కార్యక్రమం జరగాలని, ఎంఎల్ఏలు ఇతర ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేయాలని చెప్పారు. మండల నోడల్ అధికారులు తప్పకుండా పాల్గొనాలన్నారు. ప్రతి గ్రామానికి కూడా ఒక ప్రత్యేకాధికారిని నియమించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్ళి ప్రభుత్వం అమలు చేసిన కార్యక్రమాలను వివరించాలన్నారు. కర పత్రాలను పంపిణీ చేసి గ్రామాల్లో ప్రజా వేదికను నిర్వహించి సమస్యలును తెలుసుకోవాలని సూచించారు.

● స్వరాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్‌ను గ్రామ, వార్డు మండల స్థాయి, మున్సిపల్ అధికారులు రూపొందించాలని కలెక్టర్ సూచించారు. ఆయా గ్రామాలు, మండలాల పరిస్థితులు, అందుబాటులో ఉన్న వనరులు, అభివృద్ధికి ఉన్న అవకాశాలను దృష్టిలో ఉంచుకుని యాక్షన్ ప్లాన్ రూపొందించాలన్నారు. అక్టోబరు 15 నాటికి యాక్షన్ ప్లాన్ పూర్తి కావాలని కోరారు. యాక్షన్ ప్లాన్ రూపొందించే ముందు వివిధ వర్గాలతో విస్తృతస్థాయి సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలను తెలుసుకోవాలన్నారు. ప్రతి మండలం నుంచి కనీసం వెయ్యి మంది నుంచి ప్రజాభిప్రాయ సేకరణ చెయ్యాలన్నారు. విద్యాసంస్థల్లో ఈనెల 28, 29 తేదీల్లో సమావేశాలను నిర్వహించాలని సూచించారు. దీనికి ముందు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ ప్రసాద్, జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విజన్ డాక్యుమెంట్‌పై పలు సూచనలు అందించారు. జేసీ సేతు మాధవన్, సీపీవో బాలాజీ, జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి, వ్యవసాయ శాఖ జేడీ తారకరామారావు తదితరులు ఉన్నారు.

## యజమాని మోసానికి యువకుడి బలి

- భయంతో పురుగు మందు తాగిన వైనం
- చికిత్స పొందుతూ మృత్యువాత


జగదీష్ (ఫైల్)

**రాజాం రూరల్:** ఆ యువకుడు ఓ గ్లాస్ వర్క్ షాప్‌లో పని చేసేవాడు. తాను మధ్యవర్తిగా ఉండి ఆ షాప్ యజమానికి పలువురి నుంచి అప్పులు ఇప్పించాడు. అయితే, ఆ డబ్బులతో షాపు యజమాని నాలుగు నెలల కిందట పరారయ్యాడు. దీంతో బాధితులు ఆ యువకుడిని యజమాని కోసం అడిగే వారు. ప్రతిరోజూ వారు ఇంటికి వస్తుండడంతో భయంతో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. నాలుగు రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు వదిలాడు. ఈ ఘటన రాజాం పట్టణంలోని గాయత్రికాలనీలో చోటుచేసు కుంది. రాజాం ఎస్ఐ రవికిరణ్ వివరాల మేరకు.. పట్టణంలోని గాయత్రి కాలనీలో నివాసం ఉంటున్న బెల్లాన జగదీష్(20) రాజాం-శ్రీకాకుళం రోడ్‌లోని ఆంజనేయ గ్లాస్ వర్క్ షాప్‌లో పనిచేసేవాడు. షాపు యజమాని పిల్లల శ్రీను అప్పులు చేసి ఐపీ పెట్టి పరారీ అయ్యాడు. దీంతో జగదీష్‌పై ఒత్తిడి పెరిగింది. శ్రీనుకు సంబంధించిన సమా చారం అడిగేవారి సంఖ్య పెరుగుతూ వస్తోంది. దీంతో మానసికంగా కుంగిపోయి భ యానికి గురయ్యాడు. ఈనెల 15న రాత్రి పురుగుమందు తాగాడు. రాజాం ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ నాలుగు రోజులుగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి తండ్రి మోహనరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### నేడు పుణ్యగిరిలో ఇంటింటికీ ఎమ్మెల్యే

**శృంగవరపుకోట:** శృంగవరపుకోట పుణ్యగిరి గ్రామంలో శుక్రవారం ఇంటింటికీ ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పట్టణ పార్టీ అధ్యక్షుడు కొణదం మల్లేశ్వరరావు తెలిపారు. తెలుగుదేశం, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో చేసిన వంద అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ఇంటింటికీ వెళ్లి వివరిస్తారన్నారు. కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు హాజరుకావాలని కోరారు.

### దివ్యాంగులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

**జామి:** దివ్యాంగులకు అండగా రాష్ట్రప్రభుత్వం ఉందని, వారి సమస్యలు పరిష్కరించే విధంగా పనిచేస్తుందని జిల్లా జనసేన నేత పీవీఆర్ వర్మరాజు అన్నారు. గురువారం మండలంలోని చింతాడలో నిర్వహించిన దివ్యాంగుల మండల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు ఎటువంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తెస్తే పెద్దలకు చెప్పి పరి ష్కరిస్తామన్నారు. సంఘ ఉపకార్యదర్శి బోగ శివ, సన్యాసి రావు, జామి మండల దివ్యాంగ సంఘ కార్యదర్శి ఈశ్వరరావు, ఉప కార్యదర్శి బోగ శివ తదితరులున్నారు.

### యూరియా కొరత

**లక్కవరపుకోట:** మండలంలో యూరియా కొరత రైతులను వేధిస్తోంది. వరినాట్లువేసి సుమారు 2 నెలలు కావస్తుండడంతో రైతులకు యూరియా అవసరం ఏర్పడింది. వర్షాలు పడడంతో యూరియా కోసం రైతులు బ్లాక్ మార్కెట్‌ను ఆశ్రయిస్తున్నారు. బ్లాక్ మార్కెట్‌లో రూ.350లకు కొనుగోలు చేస్తున్నారు. దీనిపై మండల వ్యవసాయశాఖాధికారిణి స్వాతిని వివరణ కోరగా లచ్చంపేట రైతు సేవా కేంద్రంలో పది టన్నుల యూరియా ఉందని, సోమవారం నాటికి మండలానికి మరింత స్టాక్ వస్తుందని తెలిపారు. రైతులు బ్లాక్ మార్కెట్‌ను ఆశ్రయించవద్దని కోరారు.

### ఇంజమ్మతల్లికి పూజలు

**శృంగవరపుకోట రూరల్:** మండలంలోని శివరామరాజుపేట గ్రామంలో గురువారం గ్రామసర్పంచ్ కొట్టాడ ఝాన్సీ ఆధ్వర్యంలో ఇంజమ్మతల్లి పండుగను గ్రామస్థులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామపెద్ద జగదీష్ తదితరులు మాట్లాడుతూ అనాదిగా ఈ పండుగను నిర్వహించుకుంటున్నామన్నారు. మహిళలు అమ్మవారికి పసుపుకుంకాలను వేడుకగా సమర్పించుకున్నారు.

### రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

**లక్కవరపుకోట:** ఏపీటీఎఫ్ 80 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఓక్‌జూబ్లీ మహాసభలు నిర్వహిస్తున్నందున అందరూ కలిసి విజయవంతం చేయాలని రాష్ట్ర ఏపీటీఎఫ్ గౌరవ అధ్యక్షులు సదాశివరావు కోరారు. గురువారం ఎల్.కోట మండల కేంద్రంలో ఉపాధ్యాయులతో కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ముందు పలు డిమాండ్లు ఉంచారు. గుమ్మడి శ్రీను, పార్వతీశం, ఆర్.కృష్ణ, గంగాధర్, వాసు పాల్గొన్నారు.

### ఇండియాలోనే యువత ఎక్కువ

**కొత్తవలస:** ప్రపంచ దేశాలతో పోల్చుకుంటే యువత ఎక్కువగా ఉన్న దేశం భారతదేశమని ఇండియా ఇంటర్నేషనల్ యూనివర్శిటీ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్‌అండ్ రీసెర్చ్ వైస్ చాన్సలర్ ఆర్. వెంకటరావు అన్నారు. గురువారం తుమ్మికాపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న వాగ్దేవీ విద్యాసంస్థల్లో చట్టాలు, విద్య నైతిక విలువలు అనే అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 2047కి విద్యా వైద్య వైజ్ఞానిక రంగాల్లో అగ్రగామిగా నిలుస్తుందన్నారు. ఇందులో యువత పాత్ర కీలకమైనదన్నారు. 2047 నాటికి ప్రపంచ దేశాలన్నీ ఇండియా వైపు చూసే విధంగా యువత పని చేయాలన్నారు.

### అవగాహనతోనే రోడ్డు ప్రమాదాల నియంత్రణ

**విజయనగరం దాసన్నపేట:** రోడ్డు ప్రమాదాల నియంత్రణపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని రోడ్డు సేఫ్టీ ఎన్‌జీవో అధ్యక్షుడు మజ్జి అప్పారావు అన్నారు. గురువారం నగరంలోని సెయింట్ జోషఫ్ స్కూల్‌లో రోడ్డు సేఫ్టీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రమాదాలు జరిగినప్పుడు ప్రమాదాలకు గురైన వ్యక్తులను కాపాడి ప్రథమ చికిత్స నిర్వహించి ఆసుపత్రికి తరలించాలన్నారు. సీనియర్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టరు రవిశంకర్ మాట్లాడుతూ, మైనర్ డ్రైవింగ్ ప్రమాదకరమన్నారు. వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టరు సాయికుమార్, ప్రిన్సిపాల్ పుష్పమేరీ, సభ్యులు తరుణా వంకుశం విద్యార్థులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**వేపాడ:** వేపాడ విద్యుత్ ఉపకేంద్రంలో 11కేవీ వీలుపర్తి ఫీడర్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు మండల విద్యుత్‌శాఖాధికారి సూరిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని వలన వీలుపర్తి, వెల్దాం, పెదదుంగాడ, చినదుంగాడ, చామలాదేవి అగ్రహారం, వావిలపాడు, కడకొండ, దబ్బిరాజుపేట, చామలాపల్లి, పోతుబందిపాలెం, వెంకయ్యపాలెం కరకవలస, మారిక తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నామని, అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

### వీధి లైట్ల సమస్య పరిష్కరించండి

**విజయనగరం దాసన్నపేట:** నగరంలోని 33వ డివిజన్ ముచ్చువాని చెరు వుగట్టుపై వీధి లైట్ల సమస్య పరిష్కరించాలని సీపీఎం నగర ప్రతినిధి జగన్మోహన్ రావు కోరారు. గురువారం సచివాలయంలోని అడ్మిన్‌ను కలిసి వినతిపత్రం అం దించారు. విద్యుత్ తీగలపై వేలాడుతున్న చెట్టును తొలగించాలని కోరారు.

### పోషకార మాసోత్సవాలు

**రామభద్రపురం:** పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా బూసాయవలస అంగన్‌వాడీ సెంటర్-1లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణకుమారి తల్లులకు, బాలింతలకు, గర్భిణులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టినప్పటి నుంచి 6 నెలల వరకు మాత్రమే తల్లిపాలు ఇవ్వాలన్నారు. అనంతరం అనుబంధ ఆహారం మొదలుపెట్టాలని సూచించారు. బాలమృతం కచ్చితంగా బిడ్డకు తినిపించాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

### నేడు అలజంగిలో ఆడిట్

**బొబ్బిలి రూరల్:** అలజంగి గ్రామంలో డ్వాక్రా సంఘాల డబ్బులను తన సొంతానికి వాడుకున్న వీవోఏపై విచారణలో భాగంగా శుక్రవారం ఆడిట్ నిర్వహించనున్నట్లు ఏపీఎం శీనివాసరావు తెలిపారు.

## అన్నక్యాంటీన్ పేదల పాలిట వరం

- ఎమ్మెల్యే బేబీనాయన ● అంగరంగవైభవంగా పునఃప్రారంభం


అన్నక్యాంటీన్‌కు రూ.50 వేలుచెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

**బొబ్బిలి:** ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం మానసపుత్రిక అయిన అన్నా క్యాంటీన్లు పేదలు, అన్నార్తుల పాలిట వరమని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. ప్రజల ఆకాంక్షల మేరకు వంద రోజుల పాలనను కొనసాగిస్తున్న సీఎం, డిప్యూటీ సీఎం, ప్రధాని నరేంద్రమోదీలకు ప్రజల తరపున కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామన్నారు. గతంలో ఉండే అన్న క్యాంటీన్లను అక్కసుతో వైసీపీ ప్రభుత్వం మూసివేయించినప్పటికీ నా మనసుకు నచ్చే అద్భుత కార్యక్రమాన్ని గత 815 రోజులుగా తన సొంత సొమ్ము వెచ్చించి ప్రతి రోజూ అన్న దానం చేస్తున్నామన్నారు. చంద్రబాబు హయాంలో మళ్లీ అన్నా క్యాంటీన్లు పునఃప్రారంభం కావడంతో పేద ప్రజల కళ్లల్లో ఆనందం వెల్లివిరుస్తోందన్నారు. ఈ అదృష్టం తనకు కలగడం మరింత ఆనందంగా ఉందన్నారు. పేద బడుగు వర్గాలవారంతా దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బేబీనాయన కోరారు. అన్న క్యాంటీన్ నిర్వాహకులకు రూ. 50 వేలు చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం టోకెన్లు తీసుకున్న వారందరికీ కూటమి నాయకులతో కలిసి స్వయంగా వడ్డించారు. కార్యక్రమంలో జనసేన, బీజేపీ నేతలు పాలూరు బాబు, మరిశర్ల రామారావునాయుడు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు రాంబార్కి శరత్‌బాబు, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ గెంబలి శ్రీనివాసరావు, సీనియర్ నేతలు రౌతు రామ్మూర్తి, అల్లాడ భాస్కరరావు, వాసిరెడ్డి సత్యనారాయణ, తెలుగు మహిళానేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### నేటి నుంచి కొత్త పోర్టల్ ద్వారా ఇసుక సరఫరా

**కలెక్టరేట్:** ఉచిత ఇసుక సరఫరాలో సులభంగా ఇసుకను బుక్ చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏపీ సాండ్ మేనేజ్మెంట్ సిస్టం పోర్టల్‌ను సీఎం చంద్రబాబు నాయుడు గురువారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఆన్‌లైన్ లేదా గ్రామ వార్డు సచివాలయంలో ఉదయం 10.30 నుంచి ఐదు గంటల వరకూ ఇసుకను బుక్ చేసుకోవచ్చని సీఎం తెలిపారు. సీఎం వర్చువల్ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అంబేడ్కర్, జేసీ సేతు మాధవన్, మైన్స్ డీడీ సూర్య చంద్రరావు, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ట్రాన్స్‌పోర్టు మణికుమార్ పాల్గొని ఇసుక బుక్ చేసుకోవడం ఎలా అనేదానిపై కర పత్రాలు విడుదల చేశారు.

### ప్రభుత్వ వసతి గృహాల తనిఖీ


వసతి గృహంలో వసతులను పరిశీలిస్తున్న న్యాయాధికారి విజయకల్యాణి

**విజయనగరం (ఆంధ్రజ్యోతి):** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.విజయకల్యాణి గురువారం జిల్లా కేంద్రంలోని కాటవీధి, బాబామెట్టలోని ప్రభుత్వ వసతి గృహాలను తనిఖీ చేశారు. కాటవీధిలో ఉన్న వసతి గృహంలో మరుగుదొడ్లు పరిశుభ్రంగా లేవని, తలుపులు సరిగ్గాలేవని గుర్తించారు. భవనం శిథిలావస్థకు చేరుకున్నట్లు గమనించారు. వసతి గృహ అధికారిని వివరాలు అడగ్గా భవనం వర్షాలకు కారుతున్నట్లు తెలిపారు. బాలురు నిద్రపోయే మంచాలు తుప్పపట్టినట్లు గమనించారు. బాబామెట్టలోని బాలికల వసతి గృహంలో సరిపడే మరుగుదొడ్లు లేవని గమనించారు. అలాగే బాలకలకు వైద్యసదుపాయాలు అందుతున్నది లేనిదీ అడిగి తెలుసుకున్నారు. ఏమైన అసౌక ర్యాలు, ఇబ్బందులు ఉన్నా, జిల్లా న్యాయ సేవాధికార సంస్థను నేరుగా సంప్రదించాలని, టోల్ ఫ్రీ నెంబరు 15100లో సంప్రదించాలని సూచించారు.

### సీహెచ్‌సీలో మందుల కొరత

**బాడంగి:** స్థానిక సీహెచ్‌సీలో మందులు కొరత ఉందని సీఐటీయూ మండల కార్యదర్శి ఎ.సురేష్ అన్నారు. గురువారం ఆయన ఆస్పత్రి వద్ద మాట్లాడుతూ.. గిరిజన కుటుంబానికి చెందిన ఒక చిన్నారి కాలు ఎముక దెబ్బతిందని, దానికి సంబంధించిన బోన్ స్పెషలిస్టు రాసిన 3 మందులకు ఆసుపత్రిలో కేవలం ఒక మందే ఉండడం ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు. ఆసుపత్రి సిబ్బంది మందులను బయటకు తీసుకువెళ్తున్నారని ఆరోపించారు.

### రాహుల్‌గాంధీపై దిగజారుడు వ్యాఖ్యలు తగవు


నిరసన తెలియజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

**విజయనగరం రింగురోడ్డు:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై శివసేన పార్టీ(షిండే వర్గం) శాసనసభ్యులు సంజయ్ గైక్వాడ్, బీజేపీ నేతలు చేసిన దిగజారుడు వ్యాఖ్యలను మానుకోవాలని విజయనగరం జిల్లా అధ్యక్షుడు మరిపి విద్యాసాగర్ అన్నారు. గురువారం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు వ్యాఖ్యలపై నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్లమెంటులో ప్రతిపక్ష నేతగా వున్న రాహుల్‌గాంధీని అవమానపరిస్తే, దేశ ప్రజలను అవమానపరిచినట్టేనన్నారు. ఇకనైనా ఎన్డీఏ కూటమి నేతలు ఇలాంటి తప్పుడు వ్యాఖ్యలు మానుకోవాలన్నారు.. కార్యక్రమంలో మాజీ డీసీసీ అధ్యక్షుడు రమేష్‌కుమార్, ఏపీసీసీ కార్యదర్శి శాంతకుమారి, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే కోళ్ల


చంద్రబాబుతో మాట్లాడుతున్న ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

**శృంగవరపుకోట:** శృంగవరపుకోట శాసన సభ్యురాలు కోళ్ల లలిత కుమారి గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఏన్డీఏ శాసన సభాపక్ష సమావేశానికి విజయవాడ వెళ్లిన సంగతి తెలిసిందే. వంద రోజుల పరిపాలపై ప్రజల్లోకి తీసుకెళ్లాలని చంద్రబాబు సూచించినట్లు లలిత కుమారి తెలి పారు. ఈనెల 20 నుంచి 26 వరకు ఇంటింటికీ ఎమ్మెల్యే కార్యక్రమం ఉంటుందన్నారు.

### వంద రోజుల అభివృద్ధిపై హర్షం

**శృంగవరపుకోట:** వంద రోజుల్లో వంద అభివృద్ధి పనులు చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు దక్కుతుందని రాష్ట్ర టీడీపీ కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. గురువారం శృంగవరపుకోటలోని విశాఖ ఎంపీ శ్రీభరత్(టీడీపీ)కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. మండల పార్టీ కార్యదర్శి జుత్తాడ రామసత్యం, ఎం.మంగరాజు, గనివాడ సన్యాసినాయుడు తదితరులున్నారు. ● తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ముఖ్యమంత్రిగా నారా చంద్ర బాబు నాయుడు ప్రమాణస్వీకారం చేసిన తరువాత వందరోజుల్లో వంద కు పైగా అభివృద్ధి, సంక్షేమం పనులు చేశారని శృంగవరపుకోట మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న తెలిపారు. గురువారం స్థానిక ప్రైవేటు ఐటీఐలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు కొణదం మల్లేశ్వరరావు, నాయకులు కలిశెట్టి ఈశ్వరరావు, మోపాడ చిన్ని కృష్ణ, నరిపల్లి రామకృష్ణ, కాపుగంటి అప్పారావు, అబ్దుల్ రహీమాన్ తదితరులున్నారు.

### వ్యర్థాల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


వ్యర్థాలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

**రాజాం రూరల్:** పట్టణంలోని నరసింహనాయుడు కాలనీలో పేరుకుపోయిన వ్యర్థాల ను మున్సిపల్ సిబ్బంది గురువారం తొలగించారు. కాలనీ సమీపంలో భారీగా వ్యర్థాలు పేరుకుపోవడం, దోమల హోరు, దుర్గంధం, కాలనీవాసుల అవస్థలపై ఈనెల 17న 'వ్యర్థాలు తొలగించండి' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురిత మైన సంగతి తెలిసిందే. దీంతో కమిషనర్ రామ అప్పలనాయుడు స్పందించా రు. వ్యర్థాలను తొలగించి, పరిసరాలను పరిశుభ్రం చేయాలని శానిటరీ ఇన్ స్పెక్టర్‌కు సూచించారు. దీంతో గురువారం శానిటరీ సిబ్బంది వ్యర్థాలను తొలగించారు.

### వార్డు సందర్శన

**బొబ్బిలి:** బొబ్బిలిలో గురువారం మున్సిపల్ కమిషనర్ ఎల్ రామలక్ష్మి వార్డు సందర్శనలో భాగంగా పురపాలక సంఘ పరిధిలో గల విశ్వబ్రాహ్మణ వీధి, వైశ్య భవనం వీధి, దేవాంగుల వీధుల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి పౌష్టికాహారం ఏవిధంగా అందిస్తున్నది అక్కడ ఉన్న టీచర్లను అడిగి తెలుసుకున్నారు. ఆంధ్ర రత్న పాఠశాల పరిశీలించారు. కార్యక్రమంలో వార్డు మెంబర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### శ్మశానానికి రోడ్డు నిర్మించాలి

**బొబ్బిలి రూరల్:** దిబ్బగుడ్డివలస పంచాయతీ రాజచెరువువలస గ్రామంలో గురువారం ఎంపీడీవో పి.రవికుమార్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. శ్మశానానికి రహదారి నిర్మించాలని, గ్రామ పంచాయతీ నుంచి రాజ చెరువువలసకు రోడ్డు సౌకర్యం కల్పించాలని, మల్లంపేట వరకు విద్యుత్ స్తంభాలు వేసి దీపాలు వెలిగించాలని గ్రామస్థులు కోరారు. అనంతరం గ్రామ అంగన్వాడీ కేంద్రంలోని పౌష్టికాహారాన్ని ఎంపీడీవో పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతల రామారావు, ఎంపీటీసీ సభ్యుడు వెన్నెల నాగరాజు, పంచాయతీ సెక్రటరీ యు.వెంకటనాయుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

### ఈ పంట నమోదు చేయించుకోవాలి

**వేపాడ:** ప్రస్తుతం జిల్లాలో ఈ పంట నమోదు చురుగ్గా జరుగుతోందని, రైతులందరూ వారు సాగు చేపట్టే పంటలను నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయశాఖాధికారి యశ్వంతరావు రైతులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ పత్రికా ప్రకటనల విడుదల చేశారు. మండలంలోని ప్రతి రైతూ ఖరీఫ్‌లో సాగు చేపట్టే పంటను రిజిస్టర్ చేయించుకోవాలన్నారు. రైతు సేవా కేంద్రాలను సందర్శించి వ్యవసాయ సహాయకుల సేవలను వినియోగించుకోవాలన్నారు. ఈనెల 23 వరకు మాత్రమే ఈ క్రాపు నమోదుకు గడువు ఉందని, దీనిని సద్వినియోగ పర్చుకోవాలన్నారు.

**బొబ్బిలి రూరల్:** మండలంలోని పారాది గ్రామంలో గురువారం ఏడీఏ మజ్జి శ్యామ్‌సుందర్ రైతులకు ఈ-పంట నమోదు వలన కలిగే ఉపయోగాలను వివరించారు. ఖరీఫ్ సీజన్ 2024 ఈ-పంట నమోదు ఈ నెల 23 వరకు ఉన్నది కావున ఇంకా ఎవరైనా రైతుకు పంట నమోదు చేయుంచుకోలేకపోయినా ఈనెల 23వ తేదీ లోగా నమోదు చేసుకోవాలన్నారు.

### మేలైన యాజమాన్య పద్ధతులు

**బొబ్బిలి రూరల్:** మండలంలోని కారాడ గ్రామంలో గురువారం జీఏపి పొలంబడి కార్యక్రమం ఏడీఏ శ్యామ్‌సుందర్ ఆధ్వర్యంలో వ్యవసాయ సహాయకురాలు సంతోషి పర్యవేక్షణలో రైతులకు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామ్ సుందర్ మాట్లాడుతూ ప్రస్తుతం వరి చిరుపొట్ట దశలో ఉందని, ప్రధానంగా వరి పంటలో చిరుపొట్ట దశలో వాడుకోవలిసిన ఎరువులు, తుఫాన్ అనంతరం కనిపించే తెగుళ్ల మీద అవగాహన కల్పించారు.

### హత్యకేసులో ఒకరికి యావజ్జీవ శిక్ష

**బలిజిపేట:** హత్య కేసులో పెదపెంకి గ్రామానికి చెందిన మచ్చ అప్పలనాయుడుకు యావజ్జీవ కారాగార శిక్ష పడింది. ఈ మేరకు పార్వతీపురం రెండో అదనపు జ్యూడీషియల్ జడ్జి ఎస్.దామోదరరావు గురువారం తీర్పునిచ్చినట్టు బలిజిపేట ఎస్ఐ వై.సింహాచలం తెలిపారు. ఎస్ఐ అందించిన వివరాల ప్రకారం.. బలిజిపేట మండలం పెదపెంకి గ్రామానికి చెందిన మచ్చ అప్పలనాయుడుకు అదే గ్రామానికి చెందిన దత్తి వెంకటరావుల మధ్య 2019 మే నెల 15న ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో మచ్చ అప్పలనాయుడు కర్రతో వెంకటరావు తలపై కొట్టి తీవ్రంగా గాయపరిచాడు. తీవ్రంగా గాయపడిన దత్తి వెంకటరావు చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు దర్యాప్తు అనంతరం గురువారం పార్వతీపురం రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు తీర్పు వెల్లడించారు. ముద్దాయి అప్పలనాయుడుకు యావజ్జీవ ఖైదు, రూ.1000 జరిమానా విధించారు. పీపీజీ వెంకటనాయుడు పోలీసులు తరపున వాదించినట్టు ఎస్ఐ తెలిపారు.

### పురుగు మందు తాగి వ్యక్తి మృతి

**పాచిపెంట:** పురుగు మందు తాగి అమ్మవలస గ్రామానికి చెందిన కోట జగన్నాథం(27) బుధవారం రాత్రి మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే.. జగన్నాథం వ్యక్తిగత కారణాల వల్ల మనస్థాపానికి గురై ఈనెల 15వ తేదీన పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకునే ప్రయత్నం చేశాడు. వెంటనే కుటుంబ సభ్యులు సాలూరు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడి నుంచి కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. మృతుని తల్లి వెంకటమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

### ఇరు వర్గాల ఘర్షణపై కేసు నమోదు

**నెల్లిమర్ల:** నగర పంచాయతీ పరిధిలోని రామతీర్థం జంక్షన్ సమీపంలో గణపతి ఉత్సవాల నేపథ్యంలో బుధవారం రాత్రి ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘటనలో 13 మందికి గాయాలయ్యాయి. ఇరువర్గాలకు చెందిన పల్లా శ్రీను, కొర్నాన గౌరి గురువారం పరస్పరం ఇచ్చిన ఫిర్యాదులపై ఈ కేసు నమోదు చేశామని, విచారణ జరుపుతున్నామని ఎస్ఐ డి.రామగణేష్ తెలిపారు.

### ద్విచక్ర వాహనాలు ఢీ.. ముగ్గురికి గాయాలు

**దత్తిరాజేరు:** ద్విచక్రవాహనాలు ఢీకొని ముగ్గురికి గాయాలయ్యాయని పెదమానాపురం ఎస్ఐ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం గజపతినగరం నుంచి వంగర వెళ్తున్న బైక్‌ను మెరకముడిదాం వైపు నుంచి వస్తున్న స్కూటీ కోమటిపల్లి స్టేషన్ దగ్గర బలంగా ఢీకొంది. ఈ ఘటనలో బైక్‌పై వస్తున్న వంగర గ్రామానికి చెందిన కుబిరెడ్డి కుమార్‌నాయుడు, కొలుసు బంగారిలకు గాయాలయ్యాయి. స్కూటీపై వస్తున్న మెరకముడిదాంకు చెందిన జాడ అప్పారావుకు తీవ్ర గాయాల య్యాయి. 108కు సమాచారం అందడంతో అప్పారావును ఆసుపత్రికి తరలించామని, బైక్‌పై వచ్చిన కుబిరెడ్డి కుమార్‌నాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

### ఇసుక అక్రమ రవాణా

**బొబ్బిలి రూరల్:** అలజంగి వేగావతి నది నుంచి బొబ్బిలికి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను గొల్లపల్లి వద్ద గల దాడితల్లి అమ్మవారి ఆలయ సమీపంలో పోలీసులు అడ్డుకున్నారు. అదే గ్రామానికి చెందిన 3 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. తహసీల్దార్‌కు విషయం తెలియజేయగా గతంలో ఇచ్చిన ఆదేశాలమేరకు మొదటిసారిగా దొరికిన రెండు ట్రాక్టర్లకు రూ.10వేలు చొప్పున, రెండో సారి దొరికిన ఓ ట్రాక్టర్‌కు రూ.20వేలు మొత్తం రూ.40వేలు జరిమానా విధించారు. మరో మారు ఇసుక అక్రమ రవాణాలో దొరికితే ట్రాక్టర్ రిజిస్ట్రేషన్, డ్రైవర్ డ్రైవింగ్ లైసెన్స్‌లు రద్దుచేస్తామని తహసీల్దార్ శ్రీను స్పష్టం చేశారు.

### ఇంటిపై పడిన పిడుగు.. తప్పిన పెను ప్రమాదం

**సంతకవిటి:** మండలంలోని మోదుగులపేట గ్రామంలో ఓ ఇంటిపై గురువారం పిడుగుపడింది. దీంతో గోడ కూలి పోయింది. ఆ సమయంలో ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులకు పెను ప్రమాదం తప్పింది. పిడుగుపాటుకు ఇంటిలోని విద్యుత్తు, గృహోపకరణాలు కాలిపోయాయి. గ్రామానికి దూరంగా ఉన్న తాటి, కొబ్బరి చెట్లపై పిడుగులు పడడంతో అవి దగ్ధమయ్యాయని గ్రామస్థులు తెలిపారు.

## రైలు కిందపడి వ్యక్తి మృతి

**మెంటాడ:** మీసాలపేట గ్రామానికి చెందిన బగ్గాం రాజు(50) గురువారం రైలు కిందపడి మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు, రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజుకు కొన్నేళ్ల క్రితం నడుముకు ఆపరేషన్ చేశారు. కొద్ది రోజుల నుంచి మళ్లీ నడుము నొప్పితో బాధ పడుతున్నాడు. గురువారం ఇంటి నుంచి రాజు బయటకు వెళ్లాడు. ఎంతకీ తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. చివరికి అతని మృతదేహం రైలు పట్టాలపై కనిపించింది. బొబ్బిలి రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## రిటైర్డ్ అటెండర్‌తో పశువైద్యం

- పాడిరైతుల ఆందోళన

**బొబ్బిలి రూరల్:** మండలంలోని అలజంగి గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న వెటర్నరీ అసిస్టెంట్ సమయపాలన పాటించడం లేదు. దీంతో రిటైర్డ్ అటెండరే పశువులకు వైద్యం అందిస్తున్నారు. దీనిపై పాడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గురువారం ఉదయం 11 గంటల వరకు ఆసుపత్రికి వెటర్నరీ అసిస్టెంట్ రాలేదు. దీంతో పాడి రైతులు పడిగాపులు కాశారు. దీనిపై పశుసంవర్ధక శాఖ ఏడీ విష్ణును వివరణ కోరగా.. రెండు సచివాలయాలు ఉన్న గ్రామంలో వెటర్నరీ అసిస్టెంట్ లేరని, దీంతో ఉన్న ఆసుపత్రి అసిస్టెంట్ ఒక్కరే వైద్యసేవలందిస్తున్నారని తెలిపారు. సిబ్బందికి సమయపాలన పాటించేలా ఆదేశాలు ఇస్తామని చెప్పారు.

### భారీ అన్న సమారాధన

**వేపాడ:** మండల కేంద్రం వేపాడలో వేపచెట్టు వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం వద్ద గ్రామస్థులు,యువకులు సహాయసహకారాలతో గురువారం భారీ స్థాయిలో అన్న సంతర్పణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో వేపాడ, వల్లంపూడి,బక్కునాయుడుపేట, రాయుడుపేట, తదితర గ్రామాలకు చెందిన సుమారు 5వేల మంది భక్తులు పాల్గొని వినాయకుడి అన్న ప్రసాదాలను స్వీకరించారు. ఈ రాత్రికి వినాయకుడ్ని నిమజ్జనం చేసేందుకు యువత సిద్ధం చేసారు. ఈ సందర్భంగా కోయిడ్యాన్సు మహిళా కోలాటాలు, చిరతల భజనలు, డీజే వంటి అన్ని ఏర్పాటు చేసారు.

### గ్రీన్ అంబాసిడర్ల జీతాలు చెల్లించాలి


ఈవోపీఆర్‌డీకి వినతిపత్రం అందజేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

**బాడంగి:** బకాయి గ్రీన్ అంబాసిడర్ల జీతాలు చెల్లించాలని సీఐటీయు మండల కార్యదర్శి ఏ.సురేష్ కోరారు. గురువారం మండల ఈవోపీఆర్‌డీకి బకాయి ఉన్న 6 నుంచి 18 నెలల జీతాలు అందజేయాలని వినతిపత్రం గ్రీన్ అంబాసిడర్లతో కలిసి అందజేశారు.

## వరద బాధితులకు వితరణ

**బొబ్బిలి/బాడంగి:** విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి విరాళాలు అందించాలని కోరడంతో బాడంగి మండలంలోని ముగడ గ్రామం తరపున రూ.2లక్షల 90 వేలు విరాళంగా అందజేశారు. ముగడ గ్రామ ప్రజలు తమవంతుగా లక్ష రూపాయలు, గ్రామ పెద్దలు తమవంతుగా రూ.లక్షా 90 వేలు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మంనాయుడు రూ.30వేలు, గ్రామ సర్పంచ్ చప్ప శివున్నాయుడు రూ.20వేలు, అల్లు తిరుపతిరావు రూ.25వేలు, చల్ల సింహాచలం రూ.25వేలు, చల్ల సత్యవతి రూ.20వేలు, విజయవాడ వరద బాధితుల సహాయార్థం ముఖ్య మంత్రి సహాయ నిధి కొసం ఎమ్మెల్యే బేబీనాయనకు గురువారం అందజేశారు.

**సంతకవిటి:** మండలంలోని బొద్దూరు, మండవకురిటి, సంతకవిటి, వాల్తేరు పంచాయతీల తెదేపా శ్రేణులు విజయవాడ వరద బాధితుల కోసం విరాళాలు సేకరించారు. గురువారం మాజీ తూర్పుకాపు ఛైర్మన్ కొల్ల అప్పలనాయుడుకి మూడు లక్షల నగదు అందించారు. ఈ నగదును శుక్రవారం ముఖ్యమంత్రిని కలసి అందించనున్నట్లు ఆయన తెలిపారు.

**రేగిడి:** రేగిడి మండలంలో రేగిడి, పెద్దశిర్లాం, కోడిశ సరసనాపల్లి టీడీపీ నేతలు వరద బాధితులకు లక్ష రూపాయలు సమకూర్చారు. గురువారం రాజాం ఎంఎల్ఏ కోండ్రు క్యాంప్ కార్యాలయంలో పార్టీనేత కోండ్రు జగదీష్‌కు వాటిని అందించినట్లు మండల టీడీపీ అధ్యక్షుడు అశోక్‌కుమార్ తెలిపారు.

### వరద బాధితులకు ఐదు టన్నుల బియ్యం

**బొబ్బిలి:** విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు బొబ్బిలి మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి ఆధ్వర్యంలో మెప్మా రిసోర్స్ పర్సన్స్(ఆర్పీ) తమవంతుగా సంఘ సభ్యులు సేకరించిన ఐదు టన్నుల బియ్యం, నగదు రూ.90,000ను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయనిధికి సమకూర్చారు. వాటిని ఎమ్మెల్యే బేబీనాయనకు ఆయన క్యాంపు కార్యాలయంలో అందజేశారు.


బేబీనాయనకు విరాళాలు అందజేస్తున్న దాతలు

## ప్రకృతి సాగులో జిల్లాకు గుర్తింపు రావాలి

● కలెక్టర్ శ్యాంప్రసాద్



మన బడి- మన తోట పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్

**గరుగుబిల్లి:** ప్రకృతి వ్యవసాయ విధానాల్లో జిల్లాకు గుర్తింపు తీసుకు వచ్చేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ అన్నారు. మండలంలోని తోటపల్లి జట్టు ట్రస్ట్ కార్యాలయం ఆవరణలో అన్నపూర్ణేశ్వరి ఎఫ్‌పీసీకి చెందిన రూరల్ హోం స్టేను ఆయన గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శత శాతం ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలుగా కొండబారిడి వంటి గ్రామాలు పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయన్నారు. అనంతరం మన బడి - మన తోట శిక్షణను ప్రారంభించారు. మన బడి - మన తోట ప్రకృతి వ్యవసాయ గీతాలను ఆవిష్కరించారు. నాబార్డు డీడీఎం ఎస్.దినేష్‌కుమార్‌రెడ్డి, రైతు సాధికార సంస్థ సిలబస్ సీనియర్ సలహాదారులు డాక్టర్ డి.పారినాయుడు, జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు మాట్లాడారు. సమవేశం అనంతరం పలువురు రచయితలను సన్మానించారు. డీఈవో జి.పగడాలమ్మ, ప్రకృతి వ్యవసాయ రీజనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ వి.కృష్ణారావు, జిల్లా ప్రకృతి అధికారి పి.షణ్ముఖరావు, రీజనల్ కోఆర్డినేటర్ కె.రమాప్రభ పాల్గొన్నారు. మన బడి - మన తోట పుస్తకాలతో పాటు 8 రకాల కాయగూరల విత్తనాల కిట్లను పాఠశాలలకు అందించారు.

## ప్రణాళికలు రూపొందించాలి

**పార్వతీపురం, ఆంధ్రజ్యోతి:** స్వర్ణాంధ్ర-2047 లక్ష్యంతో అధికారులు ప్రణాళికలు రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ అన్నారు. స్వర్ణాంధ్ర విజన్-2047పై జిల్లా కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రానున్న ఐదేళ్లకు వార్షిక ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. ఈసందర్భంగా జిల్లా అధికారులను ఉద్దేశించి కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ మాట్లాడుతూ గ్రామసభలు నిర్వహించి, ప్రజల వద్ద నుంచి అభిప్రాయాలు సేకరించాలన్నారు. ప్రజా సంబంధమైన వార్షిక ప్రణాళిక ఉండాలని, ప్రజలు భాగస్వాములయ్యేందుకు క్యూఆర్ కోడ్ అందుబాటులోకి తెస్తామని చెప్పారు. జిల్లాలో ఆర్థిక, సామాజిక అంశాల పట్ల ప్రణాళికలో స్పష్టమైన అంశాలు పొందుపర్చాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి కేశవనాయుడు, డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు, ఇతర అధికారులు ఉన్నారు.

### 26లోగా గ్రామసభలు నిర్వహించాలి

**పార్వతీపురం, ఆంధ్రజ్యోతి:** ఈనెల 26వ తేదీలోగా గ్రామసభలు నిర్వహించాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ తెలిపారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పనకు తీసుకోవాల్సిన చర్యలపై మండల ప్రత్యేక అధికారులతో ఆయన గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏడాదికి 115 శాతం వృద్ధి రేటు సాధనే లక్ష్యంగా 2047 విజన్ ప్రణాళికలు రూపొందించినట్టు తెలిపారు. జిల్లా ప్రణాళిక ఆధారంగా చేసుకుని మండల స్థాయిలో ఐదేళ్ల విజన్ కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని చెప్పారు.

### పరిశుభ్రత డ్రైవ్ ఆదర్శవంతంగా చేపట్టాలి

**పార్వతీపురం, ఆంధ్రజ్యోతి:** స్వచ్ఛతా హీసేవలో భాగంగా పరిశుభ్రత డ్రైవ్ ఆదర్శవంతంగా చేపట్టాలని కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్ సూచించారు. జిల్లా అంతటా పరిశుభ్రతకు సంబంధించిన కార్యకలాపాల్లో సమిష్టి కార్యాచరణ, పౌరుల్లో భాగస్వామ్య స్ఫూర్తితో ముందుకు వెళ్లాలన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, బహిరంగ ప్రదేశాల్లో స్వచ్ఛత ప్రతిజ్ఞలు, డంప్‌ల గుర్తింపు, తొలగింపు వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మొక్కల పెంపకం, అవగాహన, ర్యాలీలు చేయాల న్నారు. కాగా, కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక అధికారులు, మండల అధికారులు ఆయా మండలాలు, పంచాయతీల్లో కార్యక్రమాలను పక్కాగా రూపకల్పన చేశారు.

## బీసీలకు అండగా నిలిచేది టీడీపీయే

**గరుగుబిల్లి:** వెనుకబడిన వర్గాలకు అండగా నిలిచేది టీడీపీయేనని పార్టీ అరకు నియోజకవర్గ బీసీ సెల్ చైర్మన్ బూరాడ రామ్మోహనరావు అన్నారు. మండల కేంద్రంలో ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడారు. బీసీలకు చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని కేంద్రానికి ప్రతిపాదించడం ఆనందకర విషయమన్నారు. అలాగే బీసీల రక్షణ చట్టానికి విధి విధానాలు తయారు చేసి అమలు చేయాలని తీర్మానించారన్నారు. బీసీ కార్పొరేషన్‌కు పూర్వ వైభవం తీసుకువచ్చి విదేశీ విద్య, ఎన్టీఆర్ ఉన్నత విద్యా శిక్షణ, బీసీ స్టడీ సర్కిల్‌తో పాటు పలు కార్యక్రమాలకు నిధులు కేటాయించేందుకు సమ్మతం తెలపడం హర్షించదగ్గ విషయమన్నారు. జిల్లాలో బీసీ భవనాల నిర్మాణాలకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. గీత కార్మికులకు మద్యం దుకాణాల్లో 10 శాతం కేటాయించడం అభినందనీయం అన్నారు. రాష్ట్రంలో మొదటి నామినేటెడ్ పదవిని బీసీ వర్గానికి కేటాయించడంపై ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

## చేయిచేయి కలిపారు.. రోడ్డు బాగుచేసుకున్నారు




రోడ్డు బాగు చేసుకుంటున్న గిరిజనులు

**సాలూరు రూరల్:** తుండ పంచాయతీలో ఇటికవలస గ్రామస్థులు గురువారం శ్రమదానంతో రోడ్డును బాగుచేసుకున్నారు. తుండ, బొడ్డవలస బీటీ రోడ్డు నుంచి కిలోమీటరు దూరంలో ఇటికవలస గ్రామం ఉంటుంది. బీటీ రోడ్డుకు అనుసంధానం చేసే ఈ రోడ్డును గత ప్రభుత్వం పట్టించుకోలేదు. గోతులమయం కావడంతో వాహనం ఎక్కడానికి ఈ రోడ్డుకు రావడానికి గిరిజనులు తిప్పలు పడేవారు. ఈ రోడ్డు బాగు కోసం పాలిక నూకయ్య, కామయ్యల ఆధ్వర్యంలో గ్రామంలో ఉన్న 44 కుటుంబాలు కొంత మొత్తంలో విరాళాలు పోగు చేసుకున్నారు. వాటితో కంకర లోడ్లు తెప్పించుకున్నారు. దానిని రోడ్డుపై వేసి, గ్రామం నుంచి బీటీ రోడ్డు వరకు రోడ్డును నిర్మించుకున్నారు.

● ఇటికవలసకు రూ.80లక్షలతో బీటీ రోడ్డు మంజూరు అయ్యిందని తుండ సర్పంచ్ సీదరపు నూకయ్య చెప్పారు. దసరా తర్వాత పనులు చేపడతారని, ఈలోగా తాత్కాలికంగా గ్రామస్థులు రోడ్డు బాగు చేసుకున్నారని తెలిపారు.

## శ్రమదానంతో నాచు తొలగింపు




శివ్వాం ప్రాంతంలో కాలువలోని నాచును తొలగిస్తున్న రైతులు

**గరుగుబిల్లి:** తోటపల్లి పాత బ్యారేజీ పరిధిలోని కుడి కాలువలో ఉన్న నాచును రైతులు శ్రమదానంతో తొలగించారు. గురువారం విజయనగరం జిల్లా వంగర మండలానికి చెందిన కొత్తవలస, బంగారువలస, చినరాజులగుడమ, పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన బలిజిపేట మండలం పోలినాయుడు వలస గ్రామాలకు చెందిన రైతులు స్వచ్ఛందంగా శ్రమదానంతో నాచుని తొలగించారు. కుడి కాలువ నుంచి రెండు మండలల పరిధిలోని గ్రామాలకు సాగునీరు సక్రమంగా అందకపోవడంతో పలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. శివారు ప్రాంత రైతులకు సాగునీరు సరఫరాలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనడంతో రైతులు పనుల నిర్వహణకు ముందుకు వచ్చారు. కాలువల అభివృద్ధికి ప్రభుత్వం చొరవ చూపాలని కోరుతున్నారు.

## మైనింగ్ అక్రమ తవ్వకాలతో నష్టపోతున్నాం

ఒడిశా



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసేందుకు వచ్చిన కాశీపూర్ సమితి ప్రజలు

**రాయగడ:** టికిరి ఉత్కళ అల్యూమీన పరిశ్రమ కోసం చేపడుతున్న అక్రమ మైనింగ్ తవ్వకాలతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని సిజిమాలి పర్వత ప్రాంత గ్రామాల ప్రజలు కలెక్టర్ పారుల్ పట్వార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కాశీపూర్ సమితి సిజిమాలి పర్వత ప్రభావిత, సాగుబరి, సుంగేరి, బొందేల్, అలిగుణ, కొంటమాలో, మాలిపొదర్ దమ్మేరపొదర్ తదితర గ్రామాల ప్రజలు బుధవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని అక్రమ తవ్వకాలను నిలిపి వేసేలా చర్యలు తీసుకోవాలని కలక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

# శిథిలావస్థలో జీసీసీ గోదాంలు

● మరమ్మతులకు నోచుకోక నిరుపయోగంగా మారిన వైనం ● పట్టించుకోని అధికారులు



శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా ఉన్న జీసీసీ గోదాంలు

**గుమ్మలక్ష్మీపురం:** మండలంలోని పలు గిరిజన సహకార సంస్థ గోదాంలు శిథిలావస్థకు చేరాయి. వీటికి సకాలంలో మరమ్మతులు చేయకపోవడంతో శిథిల స్థితిలోకి చేరుకుని, నిరుపయోగంగా మారాయి. వీటిని బాగుచేసి జీసీసీ అవసరాలకు వినియోగిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పలువురు భావిస్తున్నారు. మండలంలోని దేరువాడ, కొరడా, తాడికండ, గుమ్మలక్ష్మీపురం, దుమ్మంగి, చీమలగూడ తదితర ప్రాంతా ల్లో గిరిజన సహకార సంస్థ 1968 సంవత్సరంలో గోదాంలు నిర్మించింది. గిరిజనుల నుంచి కొనుగోలు చేసే అటవీ ఫలసాయాలను ఈ గోదాంలలో భద్రపరిచి ఇతర ప్రాంతాలకు తరలించేవారు. ప్రస్తుతం అటువైపు కొనుగోలు తగ్గిన కారణంగా ఈ గోదాంలు నిరుపయోగంగా మారాయి. గుమ్మలక్ష్మీపురం, కురుపాం ప్రాంతంలో గతంలో చింతపండును వేలాది క్వింటాళ్లలో సేకరించేవారు. కరక్కాయిలు, కొండచీపురు, నల్లజీడి పిక్కలు, నరమామిడి, ఇండిగ పిక్కల తదితర ఫలసాయాలు ఈ గోదాంల్లో ఉంచేవారు. ప్రస్తుతం వీటి కొనుగోలు నిలిచిపోయింది. అటవీ ప్రాంతం తగ్గిపోవడంతో గిరిజనులు ఆసక్తి చూపకపోవడంపై ఆ పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా సంబంధిత గిరిజన సహకార సంస్థ అధికారులు స్పందించి ఈ గోదాంలను మరమ్మతులు చేసి, ఇతర అవసరాలకు వాడుకుంటే మంచి ఫలితాలు వస్తాయని పరిశీలకులు భావిస్తున్నారు.

### ప్రతిపాదనలు పంపాం

ఈ విషయమై గుమ్మలక్ష్మీపురం గిరిజన సహకార సంస్థ సీనియర్ మేనేజర్ కృష్ణ ప్రసాద్‌ను వివరణ కోరగా ఈ గోదాంల మరమ్మతులకు తమ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరు కోసం ఎదురు చూస్తున్నామని తెలిపారు. ఇప్పటికే అటవీ ఫలసాయాలను జీసీసీ ద్వారా కొనుగోలు చేస్తున్నామని, ఆశించినంత స్థాయిలో అటవీ ఫలసాయాలు రావడం లేదని చెప్పారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ మాధవ్‌రెడ్డి

**పార్వతీపురంటౌన్:** సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ఎస్వీ మాధవ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. సైబర్, మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా యువత పనిచేయాలని పిలుపునిచ్చారు. అలాగే వర్క్ ఫ్రం హోం అంటూ కొందరు మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, యువత తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓటీపీ, సీవీవీ నెంబర్లు, పాస్వర్డ్ ఎవ్వరికి తెలియజేయరాదన్నారు. మాదవ ద్రవ్యాల వినియోగం వల్ల సామాజిక, మానసిక, శారీరక, అనారోగ్యాలు తలెత్తుతాయన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల మీ కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీపీవో అంకిత సురాన, పట్టణ సీఐ నారాయణరావు, సోషల్ మీడియా, సైబర్ క్రైం సెల్ సీఐ జీడీ బాబు, ఎస్వీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చలపతిరావు, పట్టణ పోలీసు స్టేషన్ ఎస్‌ఐలు గోవిందరావు, సంతోషికుమారి పాల్గొన్నారు.

### వ్యక్తిగత సమాచారం ఇవ్వొద్దు

**గరుగుబిల్లి:** గుర్తు తెలియని వారికి వ్యక్తిగత సమాచారాన్ని అందించవద్దని ఎస్‌ఐ పి.రమేష్ నాయుడు సూచించారు. గురువారం పెద్దూరు గ్రామంలో సైబర్ నేరాల నివారణపై ఆయన అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకుల నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి మోసపూరితంగా వ్యవహరిస్తున్నారని, అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రకృతి సాగుపై అవగాహన

**సీతంపేట రూరల్:** దేవనాపురం పంచాయతీ లక్కాయిగూడ గ్రామంలో గురువారం వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో గిరిజన రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రకృతి సాగుతో నేల ఆరోగ్యంగా ఉంటుందని చెప్పారు. వరిసాగులో రాజీలేని సూత్రాలు, లైన్ శోయింగ్, కాలిబాటలు, పసుపు అట్టలు ఉపయోగాలు, గులరాగి విధానం, చిరుధాన్యాల ప్రాధాన్యతపై వివరించారు. ఈ సదస్సులో రీసోర్స్ పర్సన్‌లు ఎ.చిరంజీవిరావు, ఎస్.ఆనందరావు, వెలుగు అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## టీసీసీ పరీక్షల ఫలితాలు విడుదల

**పార్వతీపురం, ఆంధ్రజ్యోతి:** రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్‌లో నిర్వహించిన డ్రాయింగ్ లోయర్, హయ్యర్, టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సులు(టీసీసీ), హ్యాండ్లూమ్ వీవింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయని డీఈవో జి.పగడాలమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలకు జిల్లా నుంచి 2,356 మంది హాజరు కాగా, 1,965 మంది ఉత్తీర్ణుతులయ్యారని చెప్పారు.

### డ్రాయింగ్ పరీక్షలో ప్రతిభ

**కొమరాడ:** రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్‌లో నిర్వహించిన టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ) పరీక్షల డ్రాయింగ్ లోవర్ విభాగంలో కొమరాడ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన టి.రాంబాబు ప్రథమ స్థానంలో, డి.గోవర్ధన్, ఎ.వినోద్‌కుమార్, హెచ్.ధనుంజయ, హెచ్.కిరణ్, ఎస్.వంశీవర్ధన్‌లు ద్వితీయ స్థానంలో ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మణరావు గురువారం తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**గరుగుబిల్లి:** మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయనున్నట్టు మండల విద్యుత్‌శాఖ ఏఈ బి.శంకరరావు గురువారం తెలిపారు. గొట్టివలస, మరుపెంట, ఉద్దవోలు, చినగుడబ, తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. ● **పాలకొండ:** పాలకొండ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరాకు ఆటంకం ఉంటుందని ట్రాన్స్‌కో ఈఈ టీజీకే మూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల నిమిత్తం గోపాలపురం, గొట్టమంగళాపురం, వీపీరాజుపేట, చినమంగళాపురం, యరకారాయపురం, తంటాపల్లి చిన్న కోటిపల్లి, కొండాపుం, అంపిలి, సింగన్నవలస, పరశురాంపురం, వెలగవాడ, లుంబూరు విజయరాంపురం, పాలకొండ టౌన్ నుంచి తుమరాడ వరకు, శ్రీకాకుళం రోడ్డు ప్రాంతం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు.

## తాగునీటి కోసం ఇబ్బందులు



దూర ప్రాంతాల నుంచి నీటిని తెచ్చుకుంటున్న మహిళలు

**పాలకొండ:** పట్టణంలోని పలు వీధుల్లో గత కొన్నిరోజులుగా తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. కొత్తవీధిలో పైపుల ద్వారా నీరు రాకపోవడంతో మహిళలు సుదూరంలో ఉన్న వేరే ప్రాంతాలకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. మంచినీరు సరఫరా కాకపోతే ట్యాంకర్ల ద్వారానైనా నగర పంచాయతీ అధికారులు మంచినీటిని అందించాలని కోరుతున్నారు.

## వర్షంతో హర్షం

**మక్కువ:** మండలంలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం పూట ఎండ తీవ్రతతో ఇబ్బంది పడిన ప్రజలు సాయంత్రం కురిసిన వర్షానికి కాస్త ఉపశమనం పొందారు. మక్కువ ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రైనేజీ లేకపోవడంతో రోడ్డుపై వరదనీరు ప్రవహించింది.

## ఆశపడి మోసపోయారు

**కొమరాడ:** విజయనగరం జిల్లాలోని దాసన్నపేట మెయిన్‌రోడ్డులో కార్యాలయం ఏర్పాటు చేశారు.. తమ సంస్థ పేరున ఆన్‌లైన్‌లో నగదు జమ చేస్తే వారం వారం కమీషన్ రూపంలో నేరుగా నగదు వస్తుందని ఆశ చూపారు.. దీంతో కొమరాడ మండలం విక్రంపురం గ్రామానికి చెందిన వందలాది మంది నగదు జమ చేశారు.. తీరా ఆ సంస్థ ఆర్థిక కార్యకలాపాలు నిలిపివేసింది. ఈ గ్రామంలో సుమారు రూ.50లక్షలు వరకు ఆన్‌లైన్ పేమెంట్ చేసినట్లు తెలుస్తోంది. అయితే ఆన్‌లైన్‌లో నగదు పెట్టుబడి పెట్టిన కొంతమంది బాధితులకు ఆ సంస్థ ద్వారా తిరిగి కొంత మొత్తం కమీషన్లు వచ్చినట్లు బాధితులు చెబుతున్నారు. ఒక్కసారిగా రూ.2,100 పెట్టుబడి పెడితే రోజుకు రూ.70 చొప్పున ఏడాదికి రూ.25,550లు వస్తుందని ప్రచారం చేశారు. దీంతో ఈ సంస్థకు వందలాది మంది ఒక్కొక్కరు వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టారు. అయితే ప్రస్తుతం ఈ సంస్థ ఆన్‌లైన్‌లో ఆర్థిక కార్యకలాపాలను నిలిపివేయడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏ ఒక్కరూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి ముందుకు రాకపోవడం కొసమెరుపు.

### మోసపోయాను

నేను, మా ఊరి యువత అంతా వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టాం. కొంతమందికి నగదు రావడంతో నేను ఆశపడి ఈనెల 6వ తేదీన రూ.40వేలను ఆన్‌లైన్‌లో జమ చేశాను. తీరా జమ చేసిన నాటి నుంచి ఒక్క రూపాయి కూడా నాకు రాలేదు. ఇందులో పెట్టుబడి పెట్టిన మిగిలిన వారిని సంప్రదించగా ఈ సంస్థ బోర్డు తిప్పేసిందని చెప్పారు. ఏం చేయాలో తెలియడం లేదు.

- సిరిపురం రామారావు, విక్రంపురం, కొమరాడ మండలం

### న్యాయం చేయాలి

మా గ్రామంలో అందరూ ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెడుతున్నారు. నేను కూడా కష్టపడిన కష్టాన్ని పెట్టుబడిగా రూ.18,300 ఆన్‌లైన్‌లో జమ చేశాను. ఒక్కరూపాయి కూడా తిరిగి రాలేదు. ప్రభుత్వ యంత్రాంగం స్పందించి మాలాంటి బాధితులకు న్యాయం చేయాలి.

- బొంతు మణికంఠ, విక్రంపురం, కొమరాడ మండలం

## ఆరోగ్యశ్రీ సీఈవోను కలిసిన ఎమ్మెల్యే



**పార్వతీపురం, ఆంధ్రజ్యోతి:** ఎన్టీఆర్ వైద్య ఆరోగ్యశ్రీ సీఈవో డా.జి.లక్ష్మీషాను పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర గురువారం కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన సహకారాన్ని తీసుకోవాలని, మెడికల్ కళాశాల నిర్మాణానికి అవసరమైన చర్యలు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. దీనిపై సీఈవో సానుకూలంగా స్పందించి తగు చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు.

## క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి

**గుమ్మలక్ష్మీపురం:** విద్యార్థులు చెడు వ్యసనాల జోలికి పోకుండా క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని ఏఎస్పీ సూరన్ అంకిత్ మహావీర్ పిలుపునిచ్చారు. గుమ్మలక్ష్మీపురం మండలం భద్రగిరి పీటీజీ బాలికల గురుకుల పాఠశాలను ఆయన గురువారం సందర్శించారు. చెడు వ్యసనాలకు విద్యార్థులు బానిస కావద్దన్నారు. అనంతరం ఎల్విన్‌పేట పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఎస్పీ పర్యటనలో ఎల్విన్‌పేట సీఐ హరి, ఎస్‌ఐ శివప్రసాద్ ఉన్నారు.

## వినాయకుని లడ్డూ రూ.50 వేలు

**పాలకొండ:** పట్టణంలోని గొల్లవీధి శ్రీకృష్ణ యువత ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ముగిసిన వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా లడ్డూ వేలంపాట నిర్వహించారు. టీడీపీ నాయకుడు పల్లా కొండబాబు పర్యవేక్షణలో నిర్వహించిన వేలంపాటలో పట్టణానికి చెందిన పట్టా సాయికుమార్ రూ.50వేలకు లడ్డూ దక్కించుకున్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు గంటా సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

## క్లుప్తంగా..

### నేటి నుంచి 'ప్రజావేదిక'

**సాలూరు:** సాలూరు నియోజకవర్గంలో శుక్రవారం నుంచి ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిస్తామని రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి స్థానిక విలేకర్లకు గురువారం ఫోన్‌లో తెలిపారు. సాలూరు మండలం మామిడిపల్లి గ్రామంలో నిర్వహించనున్న ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొంటానని ఆమె చెప్పారు. అలాగే నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో, పట్టణంలో ప్రజా వేదిక నిర్వహిస్తామన్నారు. తమ తమ గ్రామాల్లో కూటమి నాయకులు పాల్గొని, ప్రజల సమస్యలు తెలుసుకోవాలని కోరారు. ఈ ప్రజావేదిక పది రోజులపాటు నిర్వహిస్తామని చెప్పారు.

### సక్రమంగా విధులు నిర్వహించాలి

**మక్కువ:** వైద్య సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించాలని డీఎంహెచ్‌వో విజయపార్వతి అన్నారు. మక్కువ, శంబర పీహెచ్‌సీలను ఆమె గురువారం సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల కొరత లేకుండా చూడాలన్నారు. గర్భిణులకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మక్కువ, శంబర పీహెచ్‌సీల వైద్యాధికారులు అలైఖ్య కిరణ్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

**సీతంపేట రూరల్:** నారాయణగూడ గ్రామ సమీపంలో అక్రమంగా 40 లీటర్ల సారాను తరలిస్తున్న ఎస్.నాగభూషణరావు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అరెస్టు చేశామని స్థానిక ఎస్‌ఐ జగదీష్‌నాయుడు తెలిపారు. గురువారం తనిఖీల్లో భాగంగా చేపట్టిన దాడుల్లో సారా తరలిస్తున్నట్టు గుర్తించి దాడి చేసి పట్టుకున్నామని చెప్పారు. మరో 200 లీటర్ల పులిసిన బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేసినట్టు తెలిపారు.

### నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

**వీరఘట్టం:** వీరఘట్టం ప్రాథమిక పాఠశాలను ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటరమణ గురువారం సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, నిర్వాహకులతో మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఆనందరావు, నాగభూషణరావు, హెచ్ఎం నారాయణరావు పాల్గొన్నారు.

### నేడు నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు

**కురుపాం:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు కురుపాంలోని సాయిరాం ఆలయ ఆవరణలో శుక్రవారం నిర్వహిస్తున్నట్టు నియోజకవర్గ క్రీడల ఇన్‌చార్జి బి.మాధవరావు తెలిపారు. అలాగే శనివారం బాలికల విభాగానికి పోటీలు నిర్వహిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గానికి చెందిన ఐదు మండలాల విద్యార్థులు హాజరవుతారని తెలిపారు.

### రాయితీపై దాణా

**బలిజిపేట:** పాడి పశువులు పెంచుతున్న రైతులకు రాయితీపై దాణా పంపిణీకి సిద్ధంగా ఉన్నట్టు పశువైద్యాధికారి జి.గణేష్ గురువారం తెలిపారు. 200 కేజీల పశువుల దాణా రూ.3,160 కాగా, రూ.1,860 సబ్సిడీగా ఇస్తున్నట్టు ఆయన చెప్పారు. రైతు కేవలం రూ.1,300తోనే గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో దాణా పొందవచ్చునన్నారు. దాణా కావాల్సిన రైతులు తమ పేర్లను రైతు సేవా కేంద్రంలో ముందుగా నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

### స్వచ్ఛతపై మత్స్యకారులకు అవగాహన

**పాచిపెంట:** మత్స్యకారులు స్వచ్ఛతపై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా మత్స్యశాఖ అధికారి వేముల తిరుపతయ్య తెలిపారు. గురువారం కోడికాళ్లవలస గ్రామంలో గిరిజన మత్స్యకారులకు బయో సెక్యూరిటీ, స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. మత్స్యకారులకు సేఫ్టీ జాకట్లు పంపిణీ చేశారు. స్వచ్ఛత పాటిస్తూ సేవా కార్యక్రమాలు కూడా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సీవో ఎస్.బాలాజీ, మత్స్యశాఖ అభివృద్ధి అధికారిణి వై.శ్రీదేవి, స్థానిక మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు బి.జోగరాజు పాల్గొన్నారు.

## పరిశుభ్రతపై దృష్టి సారించాలి

**గరుగుబిల్లి:** పంచాయతీల పరిధిలో పరిసరాల పరిశుభ్రతపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని మండల పంచాయతీ విస్తరణాధికారి ఎల్.గోపాలరావు సూచించారు. గరుగుబిల్లి, పెద్దూరు, గొట్టివలస పంచాయతీల పరిధిలో గురువారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం నిర్వహించారు. కార్యదర్శి టి.భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు. ● **పాలకొండ:** స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని సచివాలయ కార్యదర్శి బొమ్మాళి ప్రసాద్, అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాదరావు కోరారు. గురువారం పీఆర్‌రాజుపేట గ్రామంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ● **కొమరాడ:** విక్రంపురంలో గురువారం స్వచ్ఛత హి సేవా కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు, ఎంపీటీసీ సభ్యుడు దేవకోటి వెంకట నాయుడు పాల్గొని, మాట్లాడారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ● **గుమ్మలక్ష్మీపురం:** దుడ్డుకల్లు, కొత్తవలస గ్రామాల్లో సర్పంచ్ నిమ్మక నీలావతి ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో సాల్మన్‌రాజు, విస్తరణ అధికారి గౌరీశంకర్, పంచాయతీ కార్యదర్శి జి.అనీల్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామస్థులతో పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. బీజేపీ ఎస్టీ మోర్చ అధ్యక్షుడు నిమ్మక సింహాచలం, సచివాలయ సిబ్బంది, ఆశ, అంగన్వాడీ, హెల్త్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

## ఉచిత ఇసుక సిద్ధం

**భామిని:** మండలంలోని నేరడి, కాట్రగడ వరద కాలువ ముఖ ద్వారంలో తొలగించిన ఇసుక సిద్ధంగా ఉందని ఇన్‌చార్జి తహసీల్దార్ రాజశేఖరం తెలిపారు. ఇసుక స్టాక్ పాయింట్‌ను ఆయన గురువారం పరిశీలించి, ఇసుక ధరల బోర్డును ఏర్పాటు చేశారు. అయితే ప్రభుత్వం అమలుచేసిన ఇసుక విధానంతో యాప్ పనిచేయకపోవడంతో వినియోగదారులకు ఇసుక అందలేదని చెప్పారు. యాప్ ప్రారంభమైన వెంటనే నమోదైన వారికి ఇసుక అందిస్తామన్నారు. ఇప్పటికీ స్టాక్ పాయింట్‌లో 2,232 మెట్రిక్ టన్నుల నేరడి బ్యారేజ్ వద్ద ఇసుక నిల్వ ఉందని పేర్కొన్నారు. ఆయనతో పాటు మైనింగ్ ఏడీ శ్రీనివాసరావు, డీటీ రమేష్, ఆర్‌ఐ రాంబాబుతో పాటు సిబ్బంది ఉన్నారు.

## బీజేపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

**బెలగాం:** పార్వతీపురంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రధానమంత్రి జన్మదినోత్సవంలో భాగంగా ఈ శిబిరం ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. ఈ శిబిరాన్ని ప్రముఖ వైద్యుడు యాళ్ల వివేక్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సొండి సంజీవ్, పేర్రాజు, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.